www.aksharamtelugudaily.com

సుఫల
# అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

శనివారం 24 ఫిబ్రవరి 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 06 సంచిక : 339 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మేడారం జనసంద్రం

-అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్ తమిళిసై
-పట్టువస్త్రాలు, నిలువెత్తు బంగారం సమర్పించిన గవర్నర్.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

**బైటర్ రింగురోడ్డుపై ఘోర ప్రమాదం**

**పటాన్‌చెరు సమీపంలో ముందున్న వాహనాన్ని, రెయిలింగ్‌ను ఢీకొన్న కారు**

**లాస్య తల, ముఖానికి తీవ్రగాయాలు.. విరిగిన దంతాలు, ఛాతీ ఎముకలు.. అక్కడికక్కడే మృతి**

**తండ్రి సంవత్సరీకం ముగిసిన 4 రోజులకే కన్నుమూత.. అధికారలాంఛనాలతో అంత్యక్రియలు**

**పాడె మోసిన మాజీ మంత్రులు హరీశ్, తలసాని.. సీఎం రేవంత్, కేసీఆర్ సహా పలువురి నివాళులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):

బీఆర్ఎస్ ఎమ్మెల్యే (కంటోన్మెంట్) లాస్య నందిత (37) బైటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శామీర్‌పేట నుంచి ముత్తంగి బైటర్ జంక్షన్ వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ దాటిన తరువాత పటాన్‌చెరు శివారు ప్రాంతంలో కారు అతివేగంగా.. గుర్తుతెలియని వాహనాన్ని వెనక నుంచి ఢీకొని అదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపు దూసుకెళ్లి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదం తీవ్రతకు వాహనం ముందువైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లూ విరిగిపోవడంతో ఆయన కారులోనే ఇరుక్కుపోయారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నందిత సీటు బెల్ట్ పెట్టుకున్నా, ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నా.. ఆమె తలకు, ముఖానికి, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి సదాశివపేట మండలం ఆరూర్‌లోని మిస్కిన్ షా దర్గాను సందర్శించారని.. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకునే క్రమంలో టిఫిన్ చేసేందుకు మరోమారు సంగారెడ్డి వైపునకు తిరుగు ప్రయాణం అయ్యారని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు. ముత్తంగి జంక్షన్ వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. ప్రమాదవార్త తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న పటాన్‌చెరు పోలీసులు.. తీవ్రంగా

## 27నుంచి..
# రెండు గ్యారెంటీలు

- రూ.500 కే సిలిండర్..
- 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ
- ఓపెనింగ్ కు ప్రియాంక గాంధీ
- మార్చి 2న 6వేల ఉద్యోగాల భర్తీ
- 2 లక్షల రుణమాఫీపై త్వరలో శుభవార్త చెబుతాం
- కాళేశ్వరం అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేయిస్తం
- సమ్మక్క- సారలమ్మ స్ఫూర్తితోనే గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేసినం
- మేడారంలో వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పణ

➢ మిగతా 2లో..

## లిక్కర్ స్కాం కేసులో
# నిందితురాలిగా కవిత

- కవిత పేరును చార్జిషీట్లో చేర్చిన సీబీఐ
- 26న విచారణకు రావాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా పేర్కొంటూ ఎమ్మెల్సీ కవిత పేరు సీబీఐ చార్జిషీటులో చేర్చింది. ఈ మేరకు కవితకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని తెలిపింది. కాగా ఇప్పటి వరకు ఆమెను నిందితు రాలిగా చేర్చకుండానే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో సమా చారం కోసం

➢ మిగతా 2లో..

# 15 రోజుల్లో విజిలెన్స్ దాడులు

**హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం హెచ్చరిక**

**పారదర్శకంగా పనిచేయాలి.. లేదంటే ఇంటికెళ్తారు**

**మున్సిపల్‌శాఖపై సమీక్షలో సీఎం**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):

: జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, మున్సిపల్ పరిపాలన విభాగాల్లో అక్రమాలను వెలికితీసేందుకు 15 రోజుల్లో విజిలెన్స్ దాడులు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా పనిచేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరించే అధికారులు ఇంటికెళ్తారని హెచ్చరించారు. శుక్రవారం హెచ్ఎండీఏ కార్యాలయంలో వాటర్‌వర్క్స్, మున్సిపల్ పరిపాలన, జీహెచ్ఎంసీపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన అనుమతుల ఫైల్స్ క్లియర్‌గా ఉండాలని స్పష్టంచేశారు. చాలా భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ఫైల్స్ కనబడటంలేదని, నిర్మాణరంగంలో ఆన్‌లైన్‌లో లేకుండా ఇష్టానుసారంగా ఇచ్చిన అనుమతుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచి చెరువుల డాటా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. 3,500 చెరువుల సమాచారం ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. చెరువులు దురాక్రమణకు గురికాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న సిబ్బందిలో వయసు పైబడినవారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఆస్తిపన్ను మదింపు కోసం డ్రోన్ కెమెరాలను ఉపయోగించే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

**మార్చిలో డెయిరీ పరిశ్రమల జాతీయ సదస్సు**

హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మార్చి 4 నుంచి 6 వరకు 50వ డెయిరీ పరిశ్రమ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐడీఏ తెలంగాణ చాప్టర్ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా పాడి రైతులు, పారిశ్రామికవేత్తలు, హాజరవుతారని తెలిపారు.

## ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

- ఇరిగేషన్ స్పెషల్ సెక్రెటరీగా ప్రశాంత్ జీవన్ పాటిల్
- సిద్దిపేట కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శైలజా రామయ్యర్
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

• 2లో

## ఈసారి హైదరాబాద్
# ఓల్డ్ సీటీ మాదే

- అసదుద్దీన్ ఓవైసీని ఓడించి తీరుతాం
- రాహుల్ జన్మలో కూడా పీఎం కాలేరు - బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి

• 2లో

## ఐదేళ్లలో అభివృద్ధికి నమూనాగా
# భారత్..

**ఇదే 'మోదీ గ్యారంటీ'..!**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):

వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి నమూనాగా భారత్ మారుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇదే 'మోదీ గ్యారంటీ' అని అభివర్ణించారు. వారణాసి పార్లమెంటు నియోజకవర్గ పర్యటనలో భాగంగా బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'కాశీ.. ఇప్పుడు వారసత్వం, అభివృద్ధికి నమూనాగా కనిపిస్తోంది. సంస్కృతి, సంప్రదాయాల చుట్టూ ఆధునికత ఎలా అభివృద్ధి చెందిందో యావత్

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

గాయపడ్డ డ్రైవర్‌ను మియాపూర్ శ్రీకర ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే లాస్యనందితను పటాన్‌చెరులోని అమే?ధా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి వార్త తెలియగానే కుటుంబసభ్యులు, బంధువులతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లాస్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె మృతిపై మాట్లాడాలని విలేకరులు కోరినా విషణ్ణవదనంతో మౌనంగా ఉండిపోయారు. గాంధీ ఆస్పత్రిలోపోస్టమార్టమ్ జరుగుతున్నంతసేపూ అక్కడి వెయిటింగ్ హాలులోనే కూర్చున్నారు. అనంతరం లాస్య ఇంటికి వెళ్లి ఏర్పాట్లు పర్యవేక్షించడంతోపాటు అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకూ ఉన్నారు.

డ్రైవర్ నిద్రమత్తు వల్లనే..

డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలోని మిస్కిన్ షా బాబా దర్గా సందర్శన అనంతరం.. లాస్య తన కుటుంబసభ్యులతో కలిసి రెండు కార్లలో హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఆమె టీఎస09జీజీ టీఆర్ 1955 నంబర్ గల మారుతీ సుజుకీ ఎక్స్‌ఎల్ 6 కారులో ప్రయాణిస్తున్నారు. అల్పాహారం కోసం శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి సంగారెడ్డి వైపు వస్తుండగా సుల్తాన్‌పూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత సుమారు 5.10 గంటల సమయంలో డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులోకి జారుకుని, కారుపై నియంత్రణ కోల్పోయి, ఎడమ వైపు ఉన్న ఓఆర్ఆర్ మెటల్ బీమ్‌కు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఎమ్మెల్యే అక్కడికక్కడే మృతి చెందారు. కాగా.. 5.15 గంటల సమయంలో ఆకాశ్ తనకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేవలం గాయాలు మాత్రమే అయ్యాయని తెలిపాడని లాస్య నందిత సోదరి నివేదిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ప్రమాద స్థలికి వచ్చి చూసేసరికి లాస్య చనిపోయి ఉందని ఆమె పేర్కొన్నారు. దీంతో డ్రైవర్ ఆకాశ్‌పై ఐపీసీ 304(ఎ) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో కారు విడిభాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్న తీరుచూస్తే.. ముందు వెళుతున్న వాహనం వెనకభాగాన్ని ఢీకొనగా, అది సుమారు వందమీటర్ల వరకు ఈ కారును ఈడ్చుకెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. ఆ వాహనం ఆచూకీ మాత్రం తెలియరాలేదు. అలాగే.. ప్రమాద సమయంలో వారి కారు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్టు స్పీడోమీటర్ వల్ల తెలుస్తోంది.

పోస్టుమార్టమ్ రిపోర్టు..

ఈ ప్రమాదంలో లాస్య తలకు బలమైన గాయమై మరణించినట్టు పోస్టుమార్టమ్ నిర్వహించిన వైద్యులు నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం ఉదయం 9.55 గంటల సమయంలో లాస్య భౌతికకాయాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగాధిపతి కృపాల్‌సింగ్, డాక్టర్ లావణ్య, పీజీ వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదంలో ఆమె తలకు కుడిభాగంలో, మెడవద్ద తీవ్రగాయాలయ్యాయి. ఎడమ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఛాతీ ఎముకలు విరిగాయి. వెన్నుకు తీవ్రగాయాలయ్యాయి. ఆరు దంతాలు పూర్తిగా విరిగిపోయాయి. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. అయితే, తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృత్యువాత పడినట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. పోస్టుమార్టమ్ పూర్తి నివేదిక రావాల్సి ఉంది. ఇక.. ప్రమాద సమయంలో కారు నడుపుతున్న ఆకాశ్ కనుబొమ పైభాగం, ముఖం వద్ద చిన్న చిన్న ఫ్రాక్చర్లు అయినట్లు, ఎడమ కాలు తొడ వద్ద ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స చేస్తున్నామని చెప్పారు.

కన్నీటి నివాళులు..

లాస్య తండ్రి మాజీ ఎమ్మెల్యే జి.సాయన్న గత ఏడాది ఫిబ్రవరి 19న అనారోగ్యంతో మరణించారు. నాలుగు రోజుల క్రితమే ఆయన ప్రథమ వర్ధంతి జరిగింది. అంతలోనే ఆయన కుమార్తె మృతి చెందడంతో.. వారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. లాస్య మరణవార్త తెలియగానే ఆమె తల్లి గీత స్పృహ తప్పిపడిపోయారు. లాస్యను తలచుకుంటూ భోరున విలపిస్తున్న ఆమె తోబుట్టువులు నమ్రత, నివేదితను, కుటుంబసభ్యులను ఆపడం ఎవరితరం కాలేదు. ఏడాది వ్యవధిలో తండ్రి, తనయ మరణించడంతో కంటోన్మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఉదయం 11.45 గంటలకు లాస్య భౌతికకాయాన్ని సికింద్రాబాద్ కారా?నా గృహలక్ష్మి కాలనీలోని నివాసానికి తీసుకువచ్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్ దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. అనంతరం మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. లాస్య మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మేడారంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన రేవంత్.. నేరుగా లాస్య నివాసానికి చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అంతకుముందు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కేసీఆర్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. లాస్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత మృతదేహం రాక ముందే కారా?నాలోని ఇంటికి చేరుకున్నారు. లాస్య తల్లి గీత, సోదరి నమత్ర, నివేదితను ఓదార్చారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎంపీలు కే కేశవరావు, సంతోషకుమార్ తదితరులు కన్నీటి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు లాస్య కడసారి చూపు కోసం తరలివచ్చారు. రేవంత్ ఆదేశాలతో లాస్యనందితకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని హిందూ శ్మశానవాటికలో రాత్రి 7.10 గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హరీశ్, తలసాని, వేముల, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి పాడె మోశారు. సాయన్న మరదలు కుమారుడు పీయూష్ రాఘవ లాస్య చితికి నిప్పంటించారు. కాగా.. లాస్యనందిత మృతి పట్ల తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మంత్రి కొండా సురేఖ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం తెలిపారు. లాస్య మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తంచేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్.. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటమితో మొదలై..

దివంగత ఎమ్మెల్యే సాయన్నకు లాస్యనందితతో పాటు మరో ఇద్దరు కుమార్తెలు నమ్రత, నివేదిత ఉన్నారు. కుటుంబ సభ్యులందరి ఆమోదంతో ఆయన లాస్య నందితను తన రాజకీయ వారసురాలిగా గతంలోనే ప్రకటించారు. 2015లో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలిగా పోటీ చేసి ఓటమిపాలైన లాస్య.. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ కార్పొరేటర్‌గా బరిలో నిలిచి విజయం సాధించారు. 2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కవాడిగూడ నుంచి మరోసారి పోటీ చేసిన లాస్య పరాజయం పాలయ్యారు. నిరుడు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ నుంచి పోటీచేసే అవకాశం ఆమెకు కల్పించింది. సాయన్నకు ఉన్న మంచి పేరు, ఆయన అనుచరుల కృషితో లాస్య 17 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తన తండ్రి స్ఫూర్తితో ఆమె సామాజిక సేవా కార్యక్రమాలూ నిర్వహించేవారని.. పుట్టినరోజు, ఇతర సందర్భాల్లో ఆహారం, చలికాలంలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసేవారని పార్టీ నాయకులు గుర్తు చేసుకుంటున్నారు. కానీ, ఎమ్మెల్యేగా ఎన్నికై మూణ్నెల్లు కాకముందే ఆమె మరణించడం విషాదం.

ఎప్పుడూ వెంట ఉండే గన్‌మెన్ లేకుండా ఎలా వెళ్లారు?

ఇరవై నాలుగు గంటలూ ఎమ్మెల్యేకు నీడలా ఉంటూ కాపాడే గన్‌మెన్ వెంట లేకుండానే ఆమె ప్రయాణం చేయడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎమ్మెల్యే కారు ప్రయాణించిన మార్గంలోని టోల్‌గేట్లు, సీసీ టీవీలను పరిశీలిస్తున్నారు.

నాడు సాయన్నకు సాధారణ అంత్యక్రియలు

గత ఏడాది ఫిబ్రవరిలో మరణించిన సాయన్న అంత్యక్రియల నిర్వహణ అప్పట్లో వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ శ్మశానవాటికలో ఆయన అనుచరులు నాడు ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి పార్టీకి చెందిన నాయకులు సర్దిచెప్పడంతో కుటుంబసభ్యుల అంగీకారం మేరకు సాధారణంగానే అంత్యక్రియలు నిర్వహించారు.

వారం క్రితం ప్రాణాలతో బయటపడి..

ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక 3 ప్రమాదాలు

లాస్య నందిత ఎమ్మెల్యేగా ఎన్నికైన మూడు నెలల్లో మూడు ప్రమాదాలు జరిగాయి. రెండు ఘటనల్లో ప్రాణాలతో బయటపడిన ఆమె.. మూడో ప్రమాదంలో కన్నుమూశారు! వీటిలో మొదటి ప్రమాదం గత ఏడాది డిసెంబరు 24న జరిగింది. ఆరోజు ఆమె బోయిన్‌పల్లి బాపూజీనగర్ సమీపంలోని ఓప్రైవేటు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ ఆమె లిఫ్టులో ఇరుక్కోవడంతో.. దాన్ని పగలగొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చారు. తర్వాత, ఈనెల 13న నల్గొండలో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు హాజరైన లాస్య నందిత.. తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో ఆమె స్వల్పగాయాలతో బయట పడ్డారు. కానీ ఆమె కారు ఢీకొని.. బందోబస్తు విధుల్లో ఉన్న హెూంగార్డు మృతి చెందాడు. సరిగ్గా వారంలోనే ఆమె ఘోర రోడ్డు ప్రమాదానికి గురై కన్నుమూయడం విషాదం. కాగా.. లాస్య కుటుంబానికి ఒక పాత కారు, ఫార్చ్యూనర్ ఉన్నాయి. ఇటీవలే తెలిసిన బంధువుల పేరుతో ఎక్స్‌ఎల్6 కారును కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైంది ఆ కారే.

# 27 నుంచి 2 గ్యారెంటీలు

**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీల్లో మరో రెండింటి అమలుకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఫిబ్రవరి 27న సాయంత్రం ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకాల ఓపెనింగ్ కు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ హాజరవుతారని చెప్పారు. సమ్మక్క సారలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తి అని, వారి దీవెనలతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. 2 లక్షల రుణమాఫీపై త్వరలో శుభవార్త చెబుతామని తెలిపారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వన దేవతలను కోరుకున్న. ములుగు జిల్లాతో, మంత్రి సీతక్కతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ముఖ్యమైన ఏ కార్యక్రమం తీసుకున్న ఇక్కడి నుంచే మొదలు పెట్టినం. 'హాథ్ సే హాత్ జోడో యాత్ర' ఇక్కడి నుంచే ప్రారంభించాం. మేడారం జాతరలో భక్తులకు ఇబ్బందులు రాకుండా రూ.110 కోట్లు మంజూరు చేశాం. జాతరకు వచ్చేందుకు 6 వేల బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశాం. 2 లక్షల రుణమాఫీపై త్వరలో శుభవార్త చెబుతాం' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**సమ్మక్క- సారలమ్మ స్ఫూర్తితోనే తిరుగుబాటు**

సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితోనే గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారి దీవెనలతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. 'తండాలు, గూడేల్లోనూ ప్రజా పాలన స్టార్ట్ చేసినం. మాది ప్రజల అజెండా. మా దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్నే విధానాలుగా రూపొందించి పరిష్కారం కోసం పనిచేస్తం' అని తెలిపారు.

**మార్చి 2న 6వేల ఉద్యోగాల భర్తీ**

ప్రభుత్వం ఏర్పడిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మార్చి 2న 6 వేల పైచిలుకు సర్కారు కొలువులను భర్తీ చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని తప్పక నెరవేరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. స్కిల్ యూనివర్సిటీలతో యువకుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తామని తెలిపారు.

## ఈసారి హైదరాబాద్ ఓల్డ్ సీటీ మాదే

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):**

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోహైదరాబాద్ ఓల్డ్ సీటీలో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని అక్కడ ఓడించి తీరుతామన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మలో కూడా ప్రధానమంత్రి కాలేరని స్పష్టం చేశారు. ఆయన కాంగ్రెస్ లో ఉన్నన్ని రోజులు కాంగ్రెస్ గెలుచుడు కల అని అన్నారు. మూడోసారి ప్రధానమంత్రి గా మోదీ ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. కాంగ్రెస్ లో ఉన్న సీనియర్ నాయకులు కూడా మోదీ పీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఎందుకు ఓటెయ్యాలో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో గారడీ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లను గెలిపిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయని కాంగ్రెస్ నేతలు మళ్లీ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ కు ఒక్కసీటు కుడా రాదన్నారు.రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతి అంతమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బొంద పెట్టడం ఖాయమని అన్నారు. పీఎం జనధన్ పథకం కింద రాష్ట్రంలో 10 జిల్లాలను గుర్తించామన్నారు. దేశంలో మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 75 సంవత్సరాల తరువాత చట్టసభల్లో 33 శాతం మహిళల రిజర్వేషన్ కల సహకారమైందన్నారు. విద్యుత్ కోతలు లేని దేశంగా భారతదేశం ఉందన్నారు. సంవత్సరానికి మూడుసార్లు పీఎం కిసాన్ సన్మాన్ నిధి బ్యాంకు అకౌంట్ లో వేస్తున్నాని, తెలంగాణ లో 40 లక్షల మంది రైతులు లబ్ది పొందుతున్నారు. ఫసల్ భీమా అమలు కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. వబ్ నేషన్- వన్ ఇండియా యూరియా అనే పథకంతో రైతులకు మేలు చేస్తామన్నారు. తెలంగాణ లోనే 35 వేల కోట్ల రూపాయలు రైతులకు సబ్సిడీ అందించామన్నారు. సమావేశంలో ఎంపీ సోయం. బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరిశ్ బాబు, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా కవిత

కవితను సీబీఐ ప్రశ్నిం చింది. దర్యాప్తు తర్వాత కవితను నిందితురాలిగా సీబీఐ పేర్కొంది. 41సి కింద నోటీసులు ఇచ్చామని కోర్టుకు సీబీఐ తెలిపింది. ఇప్పటికే కవితకు సీబీఐ నోటీసులు ఇచ్చింది. లిక్కర్ స్కాం కేసులో నిందితుల స్టేట్మెంట్స్ ఆధారంగా కవితకు నోటీసులు జారీ చేసింది సీబీఐ. 2022 డిసెంబర్లో కవితను సీబీఐ ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఆమెను నిందితురాలిగా చేర్చుకుండానే కవితను ఈడీ మూడు సార్లు విచారించింది. తాజా నోటీసుల నేపథ్యంలో ఆమె విచారణకు హాజరవుతారా..? లేదా కోర్టును ఆశ్రయిస్తారా..! అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## మేడారం జనసంద్రం

**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):** మేడారం మహాజాతరకు రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర రాజన్ హాజరయ్యారు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండాతో కలిసి గద్దెలపై కొలువై ఉన్న అమ్మవార్లను దర్శించుకున్నారు. సమ్మక్క సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గద్దెల వద్దకు చేరుకున్న గవర్నర్ వనదేవతలకు పట్టు వస్త్రాలు, నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం 11.05 నిమిషాలకు మేడారం మహా జాతరకు చేరుకున్న గవర్నర్ కు మంత్రి సీతక్క, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. ప్రత్యేక అధికారులు కృష్ణ ఆదిత్య, ఆర్.వి. కర్ణన్, శరత్, జిల్లా ఎస్పీ శబరిష్, ఇతర ఉన్నత పోలీస్ అధికారులు పూజారులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ మేడారం గొప్ప జాతర అని అన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరుకున్నానని తెలిపారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని చెప్పారు. అమ్మవార్ల ను దర్శించుకోవడం ఇది మూడోసారి అని, వారిని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. ఆరు గిరిజన గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

## ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 23(అక్షరం న్యూస్):** రాష్ట్రంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కలెక్టర్ గా ప్రశాంత్ జీవన్ పాటిల్ కు ఇరిగేషన్ స్పెషల్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో మిక్కిలినేని మను చౌదరిని నియమించారు. జనగామ కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శైలజా రామయ్యర్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. జనగామ కలెక్టర్ శివ లింగయ్యను జీఏడీలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఐదేళ్లలో అభివృద్ధికి నమూనాగా భారత్..

ప్రపంచం చూస్తోంది. వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి చిహ్నంగా భారత్ మారుతుంది. ఇదే మోదీ గ్యారంటీ' అని ప్రధాని పేర్కొన్నారు. బనారస్ విద్యార్థులను చూస్తుంటే గర్వంగా ఉందన్న ఆయన.. అమృత్ కాల్ వేళ వారు దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తారనే విశ్వాసం కలుగుతోందన్నారు. కాశీకి ఇంతకుముందున్న సామర్థ్యం, రూపం నేడు మళ్లీ ఆవిష్కృతమవుతోందన్నారు. ఈ పర్యటనలో భాగంగా వారణాసి పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.13వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనల్లో పాల్గొన్నారు.

విపక్ష కూటమిపై ఫైర్..

సంత్ రవిదాస్ 647 జయంతి సందర్భంగా వారణాసిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. విపక్ష కూటమి 'ఇండియా'పై విరుచుకుపడ్డారు. అందులోని భాగస్వామ్యపక్షాలు కులతత్వం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. వారి కుటుంబాల శ్రేయస్సు కోసమే ప్రయత్నిస్తుంటారని, దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం ఆలోచించరని విపక్ష పార్టీలపై విమర్శలు గుప్పించారు.

## బిచ్చం అడిగినందుకు తన్నిన డిప్యూటీ తహశీల్దార్..

### టిప్పర్ కింద పడి యాచకుడు మృతి

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో దారుణం జరిగింది. ఓ డిప్యూటీ తహశీల్దార్ పాశవిక వైఖరి కారణంగా ఓ యాచకుడు ప్రాణాలు కోల్పోయాడు. డబ్బులు అడిగాడని కోపంతో తన్నడంతో టిప్పర్ కింద పడి దుర్మరణం చెందాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ అమానుష ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది.వివ రాల్లోకి వెళ్తే ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి సిగ్నల్ వద్ద ఆగిన కార్లను తుడుస్తూ.. డబ్బులు అడుక్కుంటూ శివరాం అనే యాచకుడు జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం మెండోరా మండల డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్ కారు ఆ సిగ్నల్ దగ్గర ఆగింది. ఆ సమయంలో శివరాం వచ్చి డిప్యూటీ తహశీల్దార్ కారు అద్దాలను క్లీన్ చేశాడు. అనంతరం డబ్బులు ఇవ్వాలని కోరాడు. కానీ రాజశేఖర్ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. ఇంతలోనే సిగ్నల్ పడటంతో రాజశేఖర్ వెళ్లిపోయాడు. డబ్బులు ఇవ్వకుండా రాజశేఖర్ వెళ్లిపోవడంతో.. శివరాం కారు వెంబడి పరుగులు పెట్టాడు. అది చూసి ఆగ్రహానికి లోనైన రాజశేఖర్.. కోపంగా కారు దిగి శివరాంను కాలితో తన్నాడు. దీంతో అటువైపుగా వస్తున్న టిప్పర్ వెనక టైర్ల కింద పడి శివరాం ప్రాణాలు కోల్పోయాడు.టిప్పర్ కింద పడి యాచకుడు మరణించాడనే వార్త తెలుసుకున్న పోలీసులు వచ్చి ఘటనాస్థలిని పరిశీలించారు. అక్కడి కూడలిలో ఉన్న సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించగా మెండోరా డిప్యూటీ తహశీల్దార్ అమానుష చర్య బయటపడింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# వనం నుండి జనంలోకి వచ్చిన సమ్మక్క తల్లి

**బ్యాండ్ మేళాలతో పోలీసు బందోబస్తు నడుమ కోయ పూజారుల ప్రత్యేక పూజలు కుంకుమభారని అలంకరణలో గద్దెల చేరిన సమ్మక్క తల్లి.**
**తల్లి బిడ్డలు సమ్మక్క సారలమ్మ గద్దెలకు చేరడంతో భక్తజన సంద్రం.**
**భక్తజన సందోహంతో క్రిక్కిరిసిన గోదావరి బ్రిడ్జి సమ్మక్క సారలమ్మ జాతర.**



**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 22/అక్షరం న్యూస్:**
గోదావరిఖని సమీపంలోని జనగామ గ్రామం వనం నుండి కుంకుమ భరణి అలంకరణలో జాతర పూజ కమిటీ మేడారం నుండి వచ్చిన ప్రత్యేక పూజలతో గురువారం సాయంత్రం పోలీస్ భారీ బందోబస్తు నడుమ అధికార లాంఛనాలతో సమ్మక్క తల్లి అశేష భక్తజన సందోహం మధ్య గోదావరి సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలను చేరుకుంది.
బ్యాండ్ మేళాలు డప్పు చప్పులతో కోయ పూజారులు శ్యామ్ అరుణ్ సమ్మయ్య రామ్ సమ్మక్క తల్లి కుంకుమ భరణి రూపంలో జనగామ శివారు నుండి గద్దెలకు ఊరేగింపుగా తీసుకువచ్చే క్రమంలో అమ్మవారి కుంకుమ భరణి అందుకోవడం కోసం భక్తులు చాలా ఒకరినొకరు తోచుకుంటూ మొక్కులు చెల్లించుకునేందుకు పోటీపడ్డారు.ఈ క్రమంలో పోలీసులు భక్తులను అదుపులోకి తెచ్చారు. బుధవారం సాయంత్రం సారలక్క తల్లి పగిడిద రాజు గోవిందరాజులు గద్దెలకు చేరడంతో తల్లి బిడ్డలైన వనదేవతలు సమ్మక్క సారలమ్మ పగిడిద రాజు గోవిందరాజులు గద్దెనలు చేరడంతో భక్తజన సంద్రం రద్దీగా మారింది.అందరూ వనదేవతలు గద్దెలకు చేరడంతో మొక్కులు చెల్లించుకునేందుకు అశేష భక్త జనం వనదేవతల మొక్కులను తీర్చుకున్నారు. విఐపి దర్శనాలు ఉచిత క్యూలైన్ దర్శనాలు భక్తులు తండోపతండాలుగా ఒకేసారి రావడంతో కాస్త ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.శివ శక్తుల పూనకాలతో అమ్మవార్లను దర్శించుకుని భక్తులు తమ మొక్కలు చెల్లించుకున్నారు. పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి వనదేవతలకు కొబ్బరికాయలు కొట్టి బెల్లం బంగారం తమ నిలువెత్తు సమర్పించి వనదేవతలైన సమ్మక్క సారలమ్మ దీవెనలు పొందారు.భక్తులను కట్టడి చేసేందుకు వాలంటీర్లు జాతర కమిటీ నిర్వాహకులు పోలీసులు ఎస్ ఎన్ పి సి స్కౌట్స్ గైడ్స్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులకు సేవలు అందించడంలో తమ బాధ్యతను నిర్వహించారు పెద్దపల్లి డిసిపి చేతన ఐపిఎస్ గోదావరిఖని ఏసిపి రమేష్ సిఐలు ప్రమోద్ రావు ప్రసాద్ రావు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ సిఐ రవి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా అమ్మవాళ్లను దర్శించుకొనడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. భక్తులు కోళ్లను మేకలను వనదేవతలకు మొక్కులు చెల్లించి జాతర సమీపంలో బస చేసి వంట వరకు చేసుకొని కుటుంబంతో సహా భోజనాలు చేసి అమ్మవార్ల సన్నిధిలో సేద తీరారు. ఈ జాతర లో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు పలువురు వీఐపీలు కూడా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు సమ్మక సారలమ్మ జాతర ఈవో కాంతరెడ్డి,జాతర కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి బంగారు రాజయ్య జక్కబోయిన కనకయ్య మొక్క రాజయ్య పారుపల్లి రాజలింగు పాల్గొన్నారు గోదావరి వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గజ ఈతగాలను రెస్క్యూ టీం గంగపుత్రులు నీటిలో మునగకుండా రక్షణగా గోదావరిలో నిలిచారు గోదావరి బ్రిడ్జి సమీపంలోని సమ్మక్క సారలమ్మ జాతర మేడారం జాతరకు తీసుకొని విధంగా మినీ మేడారం జాతర గా జరిగింది.అశేష భక్తజనం పాల్గొన్నారు.

## సమ్మక్క జాతరకు పోటెత్తిన భక్తజనం

### తల్లులను దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**హనుమకొండ/భీమదేవరపల్లి/ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):**
రెండేళ్లకోసారి జరిగే గిరిజన జాతరకు భక్తజనం పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లుల దర్శనానికి తండోపతండాలుగా మినీ మేడారానికి కదిలారు. మినీ మేడారం గా పేరుగాంచిన మండలంలోని ముల్కనూర్ సమ్మక్క- సారలమ్మ జాతర జనసంద్రంగా మారింది. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ లకు కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు మొక్కులు చెల్లించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు శుక్రవారం జాతరకు తరలివచ్చారు. తల్లుల దర్శనం కోసం భక్తులు క్యూ లైన్లలో బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులకు అత్యంత ప్రీతిపాత్రమైన బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. జాతరలో ప్రధాన ఘట్టాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు గురువారం రాత్రి తల్లుల గద్దెల వద్ద బస చేశారు. చిన్న, పెద్ద, పిల్లాపాపలతో జాతర పరిసర ప్రాంతాలు చిక్కిరిసిపోయాయి. శుక్రవారం మాజీ ఎంపీ బోయిన్ పల్లి వినోద్ కుమార్, హనుమకొండ జడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్, జడ్పిటిసి వంగ రవి, ప్రముఖ గాయని తేలు విజయ తో సహా మరికొందరు తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఓ పక్క అధికారుల సైతం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా, పారిశుద్ధ్యపరంగా అన్ని ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

## విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి.

### ప్రముఖ సాహితీవేత్త వారాల ఆనంద్



**హనుమకొండ/భీమదేవరపల్లి/ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్):**
విద్యార్థులు సమాజం పట్ల అవగాహన, సాహిత్యం పట్ల అభిరుచిని కలిగి ఉండాలని ప్రముఖ సాహితీవేత్త, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. మండలంలోని ముల్కనూర్ ప్రజా గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంతో తనకు 30 సంవత్సరాలకు పైగా అనుబంధం ఉందని అన్నారు. పుస్తకాలు, పిల్లలే తన జీవితమంతా ఉన్నారని, టెక్నాలజీ ఎంత పెరిగిన పుస్తకానికి సరి సాటి లేదన్నారు. ప్రజా గ్రంథాలయంలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన రచించిన, సేకరించిన పుస్తకాలను ముల్కనూర్ ప్రజా గ్రంథాలయానికి అందించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, ఎదులాపురం తిరుపతి, తాళ్ల వీరేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నారుగూడెం ఫీడర్‌లో నేడు విద్యుత్ నిలిపివేత..

### తల్లాడ విద్యుత్ శాఖ ఏఈ రాజేష్

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్)**
తల్లాడ మండల పరిధిలోని అన్నారూగూడెం ఫీడర్ లో ఈనెల 24వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తల్లాడ మండల విద్యుత్ శాఖ అధికారి రాజేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వెల్లడించారు. కావున ఫీడర్ పరిధిలోని అన్నారుగూడెం, గోపాలపేట,నరసింహారావు పేట లక్ష్మీనగర్, గ్రామల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మొక్కులు చెల్లించుకున్న మాజీ ఎమ్మెల్యే దాసరి.

**సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఫిబ్రవరి 23, అక్షరం న్యూస్.**
సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతర లో మాజీ ఎమ్మెల్యే దాసరి శుక్రవారం రోజు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ బాలాజీ రావు,పాల రామారావు, బుర్ర శ్రీనివాస్, బోయిని రాజ మల్లయ్య ,ఎం.పీ.టీ.సీ శీలం శంకర్,గట్టు శ్రీనివాస్, క్యాదాసి సంజీవ్,బూర్గు వీరయ్య గౌడ్, పొన్నం సంపత్ , వెంకట రమణారావు, శ్రీనివాస రావు,సతీష్, సాయిరాం, రాజేష్ , తిరుపతి, రమేష్, కోమాల్ రెడ్డి ,పురం వెంకట రమణ,వెంకటేష్, ఈ.ఓ,కమిటీ సభ్యులు,బీ.ఆర్.ఎస్. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నార

## సాదాసీదాగా వికారాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం.

**రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్ ను ప్రవేశపెట్టిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**
**ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ.**

**వికారాబాద్, ఫిబ్రవరి 23, (అక్షరం ):**
వికారాబాద్ మున్సిపల్ 2024 - 2025 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ ను వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ప్రవేశపెట్టగా, ఈ బడ్జెట్ సమావేశానికి వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కౌన్సిల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సభ్యులు అందరు ఏకగ్రీవంగా ఆమోదించడంతో, కౌన్సిల్ సభ్యులు అందరికి చైర్ పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్ సమావేశం అనంతరం చైర్ పర్సన్ మీడియాతో మాట్లాడారు.వికారాబాద్ మున్సిపల్ 2024 - 2025 సంవత్సరానికి గాను రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్ ను ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో ఖర్చులు రూ.66 కోట్ల, 72 లక్షలు పోను.. మిగులు బడ్జెట్ రూ.26 లక్షల, 3 వేల ఉంటుందని అంచనా వేయడం జరిగింది. వీటిలో మున్సిపల్ కు వచ్చిన ట్యాక్స్ లు రూ.10 కోట్లు, నాన్ ట్యాక్స్ లు రూ.10 కోట్ల, 16 లక్షలు, డిపాజిట్స్, అడ్వాన్స్ లు రూ.45 లక్షలు, మున్సిపల్ గ్రాండ్ మొత్తం కలిపి రూ.46 కోట్ల,10 లక్షలు చూపించడం జరిగింది. అలాగే వేజెస్ అండ్ శాలరీలు రూ.5 కోట్ల, 85 లక్షలు, శానిటేషన్ పరంగా రూ.2 కోట్ల,54 లక్షలు, విద్యుత్ చార్జీలు రూ.1 కోటి,75 లక్షలు, లోన్స్ రూ.1 కోటి 10 లక్షలు, రూ.2 కోట్ల 26 లక్షల గ్రీన్ బడ్జెట్, మున్సిపల్ లోని అన్ని విభాగాలకు కలిపి మెంటెనెన్స్ చార్జీలు రూ.3 కోట్ల 22 లక్షలు, క్యాపిటల్ వర్క్స్ రూ.3 కోట్ల 69 లక్షలు, గ్రాంట్స్ రూ.46 కోట్ల 10 లక్షలు, డిపాజిట్లు రూ.45 లక్షలు కలిపి మొత్తం రూ.66.98 కోట్ల అంచనా బడ్జెట్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ప్రవేశ పట్టడం జరిగిందని చైర్ పర్సన్ వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ జాకిర్ అహ్మద్, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే విజయ రమణారావు.

**సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా) ఫిబ్రవరి 23, అక్షరం న్యూస్.**
సుల్తానాబాద్ మండలం, నీరుకుల్ల తోగార్రాయి,జూల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామాలలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మజాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మేల్యే విజయ రమణారావు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తన ఎత్తు బంగారం, బెల్లంను వన దేవతలకు మొక్కులుగా చెల్లించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురా రోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని రైతులు పాడి పంటలతో వర్ధిల్లాలని ఆ అమ్మవార్లను వేడుకున్నాట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిదులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు ప్రవేశం కొరకు మార్చ్ 11 లోపు దరఖాస్తులు సమర్పించాలి

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగైలేశ్వర్

**పెద్దపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి -23 అక్షరం న్యూస్**
2024-25 విద్యా సంవత్సరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశం కొరకు షెడ్యూల్డ్ కులాల బాల, బాలికలు ఆసక్తి గలవారు తమ దరఖాస్తులు మార్చి 11 లోపు సమర్పించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగైలేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాకు రెండు సీట్లు కేటాయించడం జరిగిందని, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి ప్రవేశం కొరకు 2017 జూన్ 1 నుండి 2018 మే 31 మధ్య జన్మించి ఉండాలని, తల్లిదండ్రులు వార్షిక ఆధాయం గ్రామీణ ప్రాంతాల వారికి ఒకటిన్నర లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు.
ఆసక్తి గల వారు పుట్టిన తేది, ఆధాయం, కుల ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్ పత్రాలను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి ధరఖాస్తుకు జతపర్చి ధరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మార్చి 11 సాయంత్రం 5 గంటల్లోపు ధరఖాస్తులు సమర్పించాలని , మార్చి 15న మద్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనునట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగైలేశ్వర్ ఆ ప్రకటనలో తెలిపారు..

## అన్నం పెట్టే.రైతన్నలపై కాల్పులు కేంద్ర ప్రభుత్వ వైఖరి సరికాదు .

**తుపాకీ తూటాలకు బలైన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి.**
**కాల్పులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి చే విచారణ చేపట్టాలి.**
**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివ శంకర్ డిమాండ్.**

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 23(అక్షరం న్యూస్)**
దేశ రాజధాని ఢిల్లీలో రైతు సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న రైతులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి శుభ కరణ్ సింగ్.యువ రైతును పొట్టన పెట్టుకున్న. అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతాంగానికి వ్యతిరేకమైన రైతు చట్టాలను రద్దు చేసి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులతో చర్చలు జరిపి సమస్యలు వెంటనే పరిష్కరించి రైతులకు గిట్టుబాటు ధరలు వెంటనే ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల్పులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి తో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు కాల్పుల్లో మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని.ఆయన కోరారు గతంలో రైతులపై బుల్డోజర్లు లారీలు టిప్పర్లతో రైతులుఆందోళన చేస్తున్న స్థలంలో బీభత్సం సృష్టించి పదుల సంఖ్యలో రైతు ల మరణానికి కారణం అయ్యారని,ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ హత్యలేనని అన్నారు.
ఢిల్లీలో రైతులపై జరిగిన కాల్పులను ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని మారేడు శివశంకర్ విజ్ఞప్తి చేశాడు.

# సమ్మక్క సారక్క లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే విజ్జన్న

**ఓదెల/ పెద్దపల్లి ఫిబ్రవరి 23(అక్షరం న్యూస్)**

ఓదెల మండలంలోని కొలనూరు గుట్టల్లో వెలసిన సమ్మక్క సారలమ్మ లను శుక్రవారం దర్శించుకున్న ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఈ సందర్భంగా అమ్మవార్లకు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం సమర్పించారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ వనదేవతల దర్శించుకోవడం సంతోషంగా ఉందని అమ్మలగన్న అమ్మలు ప్రజలను సుఖ సంతోషాలతో పాడిపంటలతో పిల్లాపాపలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండే విధంగా చూడాలని కోరడం జరిగిందని అదేవిధంగా మూడు సంవత్సరాలకు ఒకసారి వస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించుకొని ప్రతి ఇంటి సభ్యులు అమ్మవార్లను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అదేవిధంగా కోరుకున్న వారికి కొంగుబంగారమై నమ్మిన వారిని అష్ట దైవమైన శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలని అన్నారు అదేవిధంగా సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను త్వరలో శాశ్వతమైన రహదారులను త్రాగునీరు సామూహిక మరుగుదొడ్లను ఏర్పాట్లకు తమ వంతు తప్పకుండా కృషి చేస్తానని తల్లుల ఆశీస్సులతో జాతర పరిసర ప్రాంతాలను అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ డేవిడ్ షామ్ రెడ్డి వైస్ చైర్మన్ కొల్లూరి రామచంద్రం నాయకులు బైరి రవి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ మాజీ సర్పంచ్ సామ మనమ్మ శంకర్ ఎంపీటీసీ గోపు లావణ్య నారాయణరెడ్డి పిట్టల రవికుమార్ గోపగోని సారయ్య గౌడ్ ఆకుల మహేందర్ బోడకుంట శంకర్ కర్రె సంజీవరెడ్డి గట్టు యాదవ్ కుచం మల్లయ్య ఎస్పీ రాజయ్య గౌడ్



అంతటి అన్నయ్య గౌడ్ రెడ్డి రజనీకాంత్ యాదగిరి సమ్మయ్య తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్లు పాల్గొన్నారు

# దృఢ సంకల్పంతోనే 10వ తగతిలో అత్యధిక జీడిపి

**మద్నూర్ / ఫిబ్రవరి 23(అక్షరం న్యూస్ - కామారెడ్డి )**

మద్నూర్ కేంద్రంలోని త్రి - బాషా సంఘమం ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో 9వ తరగతి విద్యార్థులు సీనియర్ విద్యార్థులైన 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో హెడ్ మాస్టర్ నాంపల్లి మల్లేశం ఉర్దూ మీడియం 10వ తరగతి 9వ తరగతి విద్యార్థులకు విద్య అభివృద్ధి , పరీక్షలు రాసే విధానం తదితర అంశాలువిద్యార్థులకు తెలియజేశారు. ఉర్దూ మీడియం 10వ తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షలు దగ్గర పడటం తో విద్యార్థులు బయ భ్రాంతులకు గురికాకుండా ప్రశాంత వాతావరణం లో పరీక్షలు వ్రాసి ఉన్నత జి. డి. పి. సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యంశం నుండే ప్రశ్నలు రావడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలకు ఇంకా సమయం ఉండటం తో 10వ తరగతి విద్యార్థులు ఇష్టం, శ్రమ, పట్టుదల, కృషి తో అభ్యాసం చేస్తే మంచి మార్కులు సాధించడం జరుగుతుందని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు ఆదర్శంగా తీస్కొని వచ్చే 10వ తరగతిలో క్రమ, శిక్షణ తో విద్యను అర్జించి జ్ఞానాన్ని సాధించలాని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు తరగతి గదులలో మంచి వాతావరణం ఏర్పార్చి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధ తో వింటే మన మస్తిష్కంలో అధిక సమయం వరకు నిలువ ఉండటం జరుగుతుందని తెలిపారు. ప్రత్యకంగా 10 వ తరగతి విద్యార్థులకు పాఠ్యలు బోదించే ఊధ్యాయులు విద్యార్థులపై ప్రత్యక శ్రద్ధ తీస్కొని పాఠ్యంశాంపై పట్టుకలుగే విధంగా పాఠ్యన్ని బోదించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు జి. డి. పి. పేరుగే విధంగా విద్యార్థులకు తీర్చిదిద్దటం జరిగిందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యక శ్రద్ధ తీస్కొని ప్రవేటు పాఠశాల కంటే దిటుగా విద్యను అందించడం జరిగిందని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు కూడా వచ్చే సంవత్సరం తరగతి గదులలో ఒక మంచి వాతావరణం ఏర్పార్చి ఇష్టం తో పాఠాలు విని మంచి మార్కులు తీస్కోవచ్చి తమ తల్లిదండ్రులు, పాఠశాల, ఉపాధ్యాయుల యొక్క పేరు ప్రక్యాతాను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో హెడ్ మాస్టర్ నాంపల్లి మల్లేశం, ఉపాధ్యాయ బృందం సభ్యులు క్యాదరి రాజేందర్, సామల పట్టాభి, షాహీన్ బేగం, సభియా సిద్ధిఖి, సంగీత, షాహిన్ ఫాతిమా, బుతుల్ ఫాతిమా, నస్రీన్, బుజ్జయ్య, రమేష్, బాలు, తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతరలో మతసామరస్యం వెల్లివిరుస్తోంది

## సమ్మక్క, సారలమ్మల పోరాటం స్ఫూర్తిదాయకం
## గ్రామాల్లో జాతర సందడి నెలకొంటోంది
## కొత్తగూడెం ఎమ్మెల్యే :కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం /ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్**

నాటి రాచరిక పాలనపై వీర వనితలు సమ్మక్క, సారలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలోని రామాటాకీస్ ఏరియా, గౌతంపూర్, 2 ఇంక్లైన్, గరీపేట, లక్ష్మీ దేవిపల్లి, పులిగుండం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర ప్రదేశాలను శుక్రవారం సందర్శించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. జాతర భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరల్లో మతసామరస్యం వెల్లివిరుస్తోందని, కులమతాలకతీతంగా ఉత్సవాల్లో పాల్గొని దేవతామూర్తుల గద్దెలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. వ్యయప్రయాసలకోర్చి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ అన్నివర్గాల ప్రాణాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్న ఉత్సవ కమిటీలను ఆయన అభినందించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, వి.మల్లికార్జున్ రావు, జి.వీరస్వామి, కంచర్ల



జమలయ్య, ఎస్ కె.ఫహీమ్, నూనావత్ గోవిందు, గుగులోత్ నగేష్, తోట రాజు, అంకూస్, ఖూయ్యూమ్, బిక్షపతి, ఉపేందర్, యు. హరీష్, సపావట్ రవి, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది -ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ గా తను బాధ్యతలు నిర్వర్తించినపుడు బిఆర్ఎస్ ఎమ్మెల్యే నందిత కుటుంబంతో పాటు కంటోన్మెంట్ లో ఉండేవాడిని. మా ఇంటి పక్కనే ఉన్న మాజీ ఎం.ఎల్.ఏ స్వర్గీయ సాయన్న కుటుంబం ఉండేది.ఆ కుటుంబం తో మా కుటుంబానికి మంచి అనుబంధం ఉండేది.బంగారు భవిష్యత్ ఉన్న ఆ కుటుంబంలోని బిడ్డ ఎం.ఎల్.ఏ లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం మానసికంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాకూర్ ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# తాటికొండ రాజయ్యను కాంగ్రెస్ లో చేర్చుకోవద్దని మేడారంలో ర్యాలీ

జనగామ జిల్లా / రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఫిబ్రవరి 23:
మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కాంగ్రెస్ లో చేర్చుకోవద్దని స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు మేడారం బస్టాండ్ నుంచి అమ్మవార్ల గద్దెల వద్దకు ర్యాలీగా వెళ్ళారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజయ్యను కాంగ్రెస్ లో కి తీసుకునే ఆలోచనను విరమించుకోవాలని వారు నినాదాలు చేశారు.

# వేములవాడ పట్టణంలో విద్యుత్తు అంతరాయం....!

రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి - 23 (అక్షరం న్యూస్):
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈరోజు అనగా 24-02-2024 రోజున శివరాత్రి జాతర దృష్ట్యా విద్యుత్ మరమత్తుల కారణంగా 1వ. బైపాస్ రోడ్, టాకీస్ రోడ్, మున్నూరు కాపు సత్రం,జగిత్యాల బస్టాప్,రాం మందిర్ వీధి, జాతర గ్రౌండ్, రామతీర్తపు కాలనీ,తిప్పపూర్ ఏరియా లలో ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగును.. కావున పట్టణ ప్రజలు, విద్యుత్ వినయోగదారులు సహకరించగలరని మనవి.

# జాతర ఏర్పాట్లకు సహకరించిన వారి సేవలు చాలా అమూల్యమైనవి- ఎమ్మెల్యే మక్కాన్సింగ్

**జ్యోతి నగర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

అంతర్గాం మండలం గోలివాడ గోదావరి ఒడ్డున నెలకొన్న సమ్మక సారలమ్మ జాతర కార్యక్రమాలలో భాగంగా జాతర ఏర్పాట్లకు సహకరించిన ప్రతి శాఖ వారికి శుక్రవారం రాత్రి రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ సన్మానించారు. జాతరను ఎలాంటి ఆలోచనయ సంఘటనలు జరగకుండా అన్ని వర్గాలు సమన్వయంతో పని చేశాయని అన్నారు. ఈ సందర్భంగా,,రెవెన్యూ శాఖ పోలీసు శాఖ విద్యుత్ శాఖ వారు, ఆరోగ్యశాఖ వారు, ఎన్ టి పి సి , సింగరేణి, గ్రామపంచాయతీ కమిటీ , మత్స్య శాఖ , పలువురు ప్రభుత్వ అధికారులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు జాతర ఏర్పాట్లకు సహకరించిన ప్రతి శాఖ వారికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మీరు అందించిన సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు కమిటీ సభ్యులు మరియు మండల కమిటీ నాయకులు ముఖ్య నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి పంటల కొనుగోళ్లకు సిద్ధం

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్)**

యాసంగి పంటల కొనుగోళ్లకు సిద్ధం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెట్లకు పంటలు తెస్తున్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఏ పంటకైనా మద్దతు ధరకంటే తకువ వస్తే వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అవసరమైతే సెలవు రోజుల్లో కూడా మిర్చి క్రయ విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. 54,29,645 మంది రైతులకు రైతుబంధు సాయం ఇప్పటికే అందజేశామని, మిగతా వారికి త్వరలోనే అందజేస్తామని మంత్రి వివరించారు. సమావేశంలో ఏఐసీసీ సెక్రెటరీ రఘునందన్‌రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ బీ గోపి, మారెటింగ్ డైరెక్టర్ జీ లక్ష్మీబాయి, మార్ఫెడ్ ఎంపీ సీహెచ్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# లాస్యకు బీఆర్ఎస్ ఘన నివాళి..

## పాడే మోసిన మాజీ మంత్రులు

**హైదరాబాద్ ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్)**

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత ఇవ్వాల (శుక్రవారం) రోడ్డు ప్రమాదంలో మరణించింది. కంటోన్మెంట్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సాయన్న బిడ్డ, దళిత సమాజం నుంచి శాసన సభలో అడుగుపెట్టిన లాస్య నందిత ఆకస్మిక మరణం పొందారు. ఇక ఆమె భౌతిక దేహానికి ఈ రోజు అంత్యక్రియలు నిర్వహించారు. బంధుమిత్రులు, అభిమానులు, రాజకీయ పార్టీల ప్రముఖుల మధ్య ఆమె అంతిమ యాత్ర సాగింది. మారేడ్‌పల్లిలోని స్మశానవాటికలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు ముగిశాయి.

సికింద్రాబాద్ కారా?నాలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నుంచి ఆమె అంతిమ యాత్ర సాగింది. ఈ యాత్రలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా పలువురు లాస్య నందిత పాడె మోశారు. లాస్య నందిత మృతికి అన్ని పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావులు లాస్య నందిత భౌతిక దేహానికి నివాళులు అర్పించారు.

# అగ్ని ప్రమాద బాధితులకు బండి పరామర్శ

కరీంనగంఅగ్ని ప్రమాదంలో గుడిసెల దగ్ధమై సర్వస్వం కోల్పోయిన వడ్డెర బాధిత కుటుంబాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం పరామర్శించారు. దగ్ధమైన గుడిసెలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు సంజయ్ వద్దకు వచ్చి తాము సర్వస్వం కోల్పోయామని వాపోయారు.కష్టపడి దాచుకున్న బంగారంతోపాటు ఉపాధి కల్పిస్తున్న యంత్రాలను, వాహనాలు సైతం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయని వాపోయారు. తినడానికి తిండి లేని పరిస్థితుల్లో తమకు తాత్కాలిక బసను కల్పించడంతోపాటు భోజన వసతిని మీరే(బండి సంజయ్) కల్పించారని, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందించారని పేర్కొన్న బాధితులు మీకు రుణపడి ఉంటామని బండి సంజయ్ కు చేతులెత్తి నమస్కరించారు. కోల్పోయిన గుడిసెలను మళ్లీ వేసుకోవాలనుకుంటున్నామని, ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

# వైరాలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టిన... ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్

**ఖమ్మం/వైరా ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్)**

వైరా మండల కేంద్రంలో ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ అధ్వర్యంలో పోలీసులు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేకుండా, సరియైన వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడిపించిన వారిపై జరిమానాలు విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బయటకు వచ్చినప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. తల్లి తండ్రులు మైనర్ లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ బాల్య, జాని, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రికెట్ క్రీడాకారులకు మంత్రి పొంగులేటి ఆర్థిక సాయం..

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్)**

ఖమ్మం : ఈనెల 24, 25, 26 వ తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సేవాలాల్ మహారాజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వెళ్లే జిల్లా జట్టు క్రీడాకారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. రూ. 15వేల మొత్తాన్ని ఖమ్మం క్యాంప్ కార్యాలయ సిబ్బంది కూసుమంచి మండలానికి చెందిన భూక్య వేణు మాధవన్, వెంకటేష్ వడిత్య విజయ్, గుగులోత్ శ్రీకాంత్ అనే క్రికెట్ క్రీడాకారులకు అందించారు. క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డిని కలిసి.. తమ రవాణా, ఇతర ఖర్చులకోసం సాయం చేయాలని విన్నవించగా.. వెంటనే స్పందించి రూ. 15,000 ఆర్థిక సాయంగా అందించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై

# అధికారుల చర్యలేవి...?

- అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి మొర్రో అంటే పట్టించుకోరా...?
- చర్యలు తీసుకోకపోవడం వెనకాల అజ్ఞత శక్తి ఏంటి...?

**మహబూబాబాద్/కేసముద్రం/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:**

అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సాగు కోసం కేటాయించిన భూములను ఫ్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు ఉన్నా అవేవీ పట్టనట్లు యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి.గత పాలకుల ప్రోత్సాహం,అధికారుల చేతివాటంతో కోట్లాది రూపాయల అసైన్డ్ భూమి అన్యాక్రాంతమవుతుంది.

పరిరక్షించాల్సిన అధికారులు మొద్దునిద్రలో ఉన్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు.చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు.వీరి పుణ్యమా అని ఏకంగా అసైన్డ్ భూములలో వందలాది ఇండ్లు వెలిశాయి. అధికారులు,గత స్థానిక ప్రజాప్రతినిధులు కుమ్మక్కు అయ్యే.. ఈ తతంగానికి తెరలేపారు అనటంలో సందేహమే లేదు.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో నయా అక్రమాలు మొదలయ్యాయి. ప్రభుత్వ భూమిని ఏం చక్కా.. ఆక్రమణదారులు అన్యాక్రాంతం చేస్తూ కాజేస్తున్నారు.నిరుపేదలకు ఇవ్వాల్సిన ఇండ్లు ఇవ్వకుండా.. గుడిసెలు వేసుకోవడానికి కనీసం గుంట జాగ ఇవ్వకుండా... ప్రభుత్వాలు నిరుపేదలను మోసం చేస్తుంటే.. ఇటు.. కబ్జా కోరులు కూడా అంతకు తగ్గట్టుగా తగుదనమ్మా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేసముద్రం మండలంలోని సర్వే నెంబర్ 262,256 అసైన్డ్ భూములలో అక్రమంగా నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి.గ్రామ పంచాయతీ అనుమతి లేకున్నా.. ఇంటినెంబర్లను సృష్టించి భవనాలను లేపుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న అసైన్డ్ భూములలో అక్రమార్కులు చొరబడి పక్కా భవనాలు నిర్మిస్తున్నారు.నిర్మాణాలు పూర్తి అయిన వారు.. కమర్షియల్ బిజినెస్‌లకు వినియోగిస్తున్నారు.అసైన్డ్ భూములలో నిర్మాణాలు చేపట్టేందుకు ఎలాంటి అనుమతులు అధికారులు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నా,ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. రోజుకో నిర్మాణం అన్న చందంగా వెలుస్తున్నా.. అధికారులు మాత్రం కల్లులేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారు.తీవ్ర నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుందని

వలువురు బహిరంగంగానే అధికారులను విమర్శిస్తున్నారు. స్థానికంగా ఉన్న అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారు మొర్రో.. అని చెప్పినా.. అటు ఉన్నతాధికారులు సైతం కేసముద్రం అసైన్డ్ భూములపై దృష్టి సారించడం లేదు.

### ఎందుకీ నిర్లక్ష్యం..?

అసైన్డ్ భూముల అక్రమాలపై అక్షరం పత్రిక.. ఇప్పటికీ పలు దఫాలుగా కథనాలు వెలువరించినా.. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి.నిజంగానే.. స్థానిక అధికారులు మామూళ్లకు పాల్పడ్డారా.. అందుకే చర్యలు తీసుకోవడం లేదా అనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అటు దృష్టిసారించాల్సిన ఉన్నతాధికారులు ఎందుకు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారంటే.. వీరి వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్టుగా తెలుస్తోంది. అందుకే.. అసైన్డ్ భూముల పరిరక్షణపై మొద్దు నిద్ర వ్యవహరం కొనసాగిస్తున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఆ రాజకీయ నాయకులు అజ్ఞాతంగా ఉండటంతోనే.. అధికారులు ముందుకు కదలడం లేదని ప్రజాసంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కేసముద్రం మండల కేంద్రంలోని 262,256 లలో గల సర్వే నెంబర్లలో వందలాది ఎకరాల అసైన్డ్ భూమికి డోర్ నెంబర్లను సృష్టించి అసైన్డ్ భూమిని రాబందులు కాజేశారు.ఇప్పటికైనా.. జిల్లా ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ,పంచాయతీ అధికారులు దృష్టిసారించి కోట్లాది రూపాయల అసైన్డ్ భూములను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.లేక ప్రజాసంఘాల అనుమానాలు నిజం చేస్తారా అని వేచి చాడాలి.

## సిరిసిల్ల పట్టణం 9 వ వార్డులో సంత్ శ్రీ సేవాలాల్ జయంతి "ఉత్సవాలు"

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది**

రాజన్న సిరిసిల్ల/ సిరిసిల్ల అర్బన్/ ఫిబ్రవరి 23 (అక్షరం న్యూస్): సిరిసిల్ల పట్టణం తొమ్మిదవ వార్డు లో సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి ఉత్సవాలకు వేములవాడ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కొరకు ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని జిల్లా బంజారా భవన్ నిర్మాణానికి అవసరమైతే మరిన్ని ప్రభుత్వ ప్రత్యేక నిధులు తీసుకువచ్చేలా కృషి చేస్తానని అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా లంబాడి గిరిజన సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన విప్లవ నాయకుడు కొమరం భీమ్ , ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ ల గౌరవార్థం వారి పేర్లతో హైదరాబాదులో ఎంతో ప్రతిష్టాత్మకంగా సేవాలాల్ మహారాజ్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసి భవన్ ల పేర్లతో ఆత్మగౌరవ భవనాలను నిర్మించారని గుర్తుచేశారు. అదేవిధంగా పురపాలక సంఘ పాలకవర్గం నుండి బంజారా సోదరుల పండగలకు మరియు ఇతర అవసరాలకు పురపాలక సంఘం నుండి అందించాల్సిన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అలాగే మన పెద్దల నుండి మనకు సంక్రమించిన సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇలాంటి ఉత్సవాలు మన ఐకమత్యానికి నిదర్శనమని అన్నారు. ఈ జయంతి ఉత్సవ కార్యక్రమంలో కౌన్సిలర్ బుక్య రెడ్డి నాయక్, లింగంపల్లి సత్యనారాయణ, వీర్నపల్లి జెడ్.పి.టి.సి కళావతి, వివిధ మండలాల జెడ్పిటిసిలు, ఎంపీపీలు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, లంబాడి కుల సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రముఖులు , గిరిజన సోదర సోదరీమణులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా మెట్టు ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**రాజన్న సిరిసిల్ల / ముస్తాబాద్/ఫిబ్రవరి-23(అక్షరం న్యూస్)**

ముస్తాబాద్ మండలం మద్దికుంట శ్రీ మెట్టు రాజరాజేశ్వర స్వామి, శ్రీ దుర్గా మాత, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం ప్రథమ వార్షిక పూజా ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామి కరకమలముల చేతుల మీదుగా ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకము జరిపారు. అనంతరము మాధవానంద స్వామి అనుగ్రహ భాషణం, భక్తులకు ఆశీర్వాద వచనములు చేశారు. వేద పండితులు రఘురామ శర్మ, శాస్త్రుల శ్యామ్ సుందర్ శర్మ నేతృత్వంలో రుద్ర హవనము, హోమము, శివ కళ్యాణము కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఎంపీపీ జనగామ శరత్ రావు, వందలాది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రతినిధి గోదా అంజిబాబు దంపతులు వార్షికోత్సవ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు వస్తాల రాజమౌళి, వీరేశం, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడాకారులకు మంత్రి పొంగులేటి ఆర్థిక సాయం

ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / ఫిబ్రవరి 23/ అక్షరం న్యూస్ /

ఈనెల 24 25 26 వ తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సేవాలాల్ మహారాజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వెళ్లే జిల్లా జట్టు క్రీడాకారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. రూ. 15వేల మొత్తాన్ని ఖమ్మం క్యాంప్ కార్యాలయ సిబ్బంది కూసుమంచి మండలానికి చెందిన భూక్య వేణు మాధవన్ వెంకటేష్ వడిత్య విజయ్, గుగులోత్ శ్రీకాంత్ అనే క్రికెట్ క్రీడాకారులకు అందించారు. క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డిని కలిసితమ రవాణా, ఇతర ఖర్చులకోసం సాయం చేయాలని విన్నవించగా వెంటనే స్పందించి రూ. 15,000 ఆర్థిక సాయంగా అందించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరం..... మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / ఫిబ్రవరి 23/ అక్షరం న్యూస్ :/

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## శుభకరణ్ సింగ్ మృతికి కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్.

ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / ఫిబ్రవరి 23/ అక్షరం న్యూస్ :/

పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో జరుగుతున్న రైతు ధర్నాలో శుభకరణ్ సింగ్ మృతిపై హత్య కేసు నమోదు చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు.శుక్రవారం నాడు సంజీవరెడ్డి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ వచ్చాక రైతుల జీవితాలు దుర్భరంగా మారాయని ఎప్పుడు చూసినా హర్యానా పంజాబ్ ఢిల్లీ సరిహద్దులలో రైతు ఆందోళనలే కనిపిస్తున్నాయని దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరే నని ఇకనైనా చర్చల ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించి ఆందోళనలను నిలిపివేయాలని కాల్పుల ఘటనలను పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించాలని రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధరను కల్పించాలని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించవద్దని రైతు సమస్యలు పరిష్కరించుకుంటే అక్కడ రైతులకు మద్దతుగా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లాలో ఉద్యమాలు చేస్తామని ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికలలో రైతులు బిజెపికి తగిన బుద్ధి చెప్తారని రాహుల్ గాంధీ నేతృత్వంలో ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెంటనే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాల నుంచి రైతు వ్యతిరేక విధానాలు అవలంబించడం బాధాకరంగా ఉన్నదని శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా చేస్తున్న రైతులపై కాల్పులు జరపడం అన్యాయమని అన్నారు. అత్యంత కర్కశంగా జరిపిన కాల్పుల్లో మరణించిన శుభకరణ్ సింగ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటెముక్కల నాగేశ్వరరావు జిల్లా కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు బోడ తావూరియా నాయక్ చీమల దారి గోపి జిల్లా కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి సన్నీల్ల వెంకటేష్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు సైదుల్ నాయక్ వల్లపు శ్రీను యాదవ్ గార్ల రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన..

ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / ఫిబ్రవరి 23/ అక్షరం న్యూస్ :/

కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో శనివారం పర్యటిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ తిరుమలాయపాలెం కూసుమంచి నేలకొండపల్లి మండలాల్లో జరిగే పలు వివాహాది శుభకార్యక్రమాలు దైవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి తెలిపారు.

## సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

- వ్యవసాయరంగంలో తిరుగులేని ఆధిక్యం
- విమర్శలతో నిజాలు కప్పిపుచ్చలేరు: వేముల

నిజామాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్ /

బిఆర్ఎస్ పాలనలో వ్యవసాయం బాగుపడిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దానిని కొనసాగించే విషయంలో ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఉన్న జలాశయాలను వాడుకుని నీటిని పొలాలకు మళ్లించాలన్న దృష్టి పెట్టడం లేదన్నారు. కేవలం చిన్నిచిన్న పొరపాట్లను చూపి, గత పాలనను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. నిజానికి మల్లన్న సాగర్ సాకారంతో కాళేశ్వరం కల పూర్తిగా సాకారం అయ్యిందన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని నాటి సీఎం కేసీఆర్ కృషి చేసారని, అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్గా నిలిచారన్నారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ నేతలు అదేపనిగా విమర్శలు మాని,మల్లన్న సాగర్‌ను, కొండపోచమ్మ సాగర్‌ను చూస్తే నీటి రాక ఎలా ఉందో తెలుస్తుందన్నారు. ప్రాజెక్టులకు నిధులతో సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కాగితం పులులు, సోషల్‌మీడియాలో దుష్ప్రచారంతో పబ్బం గడుపుతున్న అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచించే ప్రభుత్వమని రుజువైందని తెలిపారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి,కాంగ్రెస్ నేతలు తమ పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో ధరలు పెంచడం తప్ప బిజెపి చేసిందేమీ లేదన్నారు. కెసిఆర్ హయాంలో పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి హహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. పదివేల పంట పెట్టుబడి ఇచ్చామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిపామని అన్నారు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఏమీ చేయలేదన్న రీతిలో బురదజల్లే కార్యక్రమం చేపట్టడం తగదని అన్నారు. ఇది ప్రజలు కూడా జీర్ణించుకోలేరని అన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వం దని మాజీమంత్రి అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలిగామని అన్నారు. చిన్న మండలాలు, జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయని అన్నారు.

## మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

- గద్దెల వద్ద కేంద్రమంత్రి ముండాతో కలసి పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పణ

ములుగు,ఫిబ్రవరి23(అక్షరం న్యూస్

మేడారం సమక్క – సారమ్మ మహా జాతర వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో భక్తులు మేడారంకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ , కేంద్ర మంత్రి అర్జున్ ముండా మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, కేంద్రమంత్రి నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమిళిసై, అర్జున్ ముండా వనదేవతలను దర్శించుకున్నారు.దర్శనానంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరానని తెలిపారు. ఇది గొప్ప జాతర అని కొనియాడారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని తెలిపారు. 'నేను గవర్నర్‌గా మూడోసారి మేడారం జాతరకు రావడం నా అదృష్టం' అని గవర్నర్ తమిళిసై హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు. కాగా.. సమ్మక్క–సారలమ్మల నామస్మరణతో మేడారం మహా జాతర ప్రాంగణం మార్మోగుతోంది. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటికే గద్దెలపైకి సమక్క సారలమ్మలు చేరుకోవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 21 నుంచి జాతర ప్రారంభమవగా.. నాలుగు రోజుల పాటు వనదేవతల జాతర జరుగనుంది. తిరిగి అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

## లాస్యనందిత మృతికి మంత్రుల సంతాపం

- ఆమె మృతి తీరని లోటన్న పలువురు నేతలు

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

కంటోన్మెంట్ భారాస ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సంతాపం

ప్రకటించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెదేపా అధినత చంద్రబాబునాయుడు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. పటాన్‌చెరు ఆస్పత్రికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు.తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య నందిత మృతి చెందడం దురదృష్టకరం. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచింది. లాస్య నందిత కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఆమె శ్రేయోభిలాషులు, స్నేహితుల నుంచి వస్తున్న ప్రేమ, మద్దతు ఆ కుటుంబానికి బలాన్ని చేకూర్చాలని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. వారం క్రితమే లాస్యను కలిసి మాట్లాడాం. ఇంతలోనే ఇలాంటి షాకింగ్, దిగ్భ్రాంతికర వార్త వినాల్సి వచ్చింది. ఇలాంటి కష్ట సమయాల్లో లాస్య కుటుంబ సభ్యులకు, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతి అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య మృతి ఎంతో బాధ కలిగించింది. ఆమె కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితెలిపారు. చిన్న వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై.. తన తండ్రి, దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందిన నందిత అకాల మృతి తీవ్ర బాధాకరం. ఏడాది క్రితం సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు మృతి చెందడం విచారకరమని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. లాస్య.. గొప్ప భవిష్యత్ ఉన్న యువ నాయకురాలు. ప్రజల మద్దతుతో ఎన్నికై ఇలా అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతినిమాజీ మంత్రి తలసాని ప్రకటించారు. లాస్య ఇంటికి వెళ్లి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# జిఎస్టీతో కుదేలవుతున్న జనం

- భారం తగ్గించడంలో కేంద్రం విఫలం
- ప్రాంతీయ పార్టీలకు పాగపెడుతున్న మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(అక్షరం న్యూస్ /

ఐదురాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఫలితాలు బిజెపికి అనుకూలంగా ఉన్న వేళ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఢోకా లేదన్న ధీమాలో బిజెపి ఉంది. అందుకే సామాన్యుల బాధలు పట్టడం లేదు. సమస్యలు చర్చించడం లేదు. ప్రధానంగా పెట్రోల్ ధరలు పెరగడం... జిఎస్టీ స్లాబులు పెరగడం లాంటివి భారంగా మారిన చర్చించడం లేదు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీసి రాజకీయంగా లబ్దిపొందాలన్న దురాలోచనలో కేంద్రం ఉన్నట్లు కనపడుతోందని విపక్ష కాంగ్రెస్ విమర్శిస్తోంది. బయటకు కనిపించకున్నా ఆర్థికంగా అనేక రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నాయి. తము అనుకున్న రీతిలో రాష్ట్రాలను ఊబిలోకి దించి విద్యుత్, ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలన్న ప్రణాళిక వేస్తున్నారు. మోడీ దృష్టిలో ఎంత మేరకు ఆదాయం రాబట్టామనే లెక్కలు

వేసుకుంటున్నారు. జిఎస్టీ ఆదాయాన్ని విజయంగా చూస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు కనిపించడం లేదు. అయితే దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశ పెట్టాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వాల కాలం నుంచే మొదలయ్యింది. యూపిఎ హయాంలో జిఎస్టీ తీసుకుని రావాలన్న నిర్ణయాన్ని ఆనాడు ప్రస్తుత బిజెపి పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోడీ కూడా గుజరాత్ సిఎం హోదాలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, ప్రజలపై భారం పడుతుందని వాదించారు. కానీ తాను ప్రధాని అయ్యాక దీనిని బలవంతంగా ప్రజలపై రుద్దారు. ఇప్పుడు జిఎస్టీతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనుభవంలోకి వచ్చింది. ఒకేరకమైన పన్ను విధానంతో రకరకాల పన్నులు పోయి ఒకటే విధానం ఉంటుందని,సులభంగా కూడా ఉంటుందని ఆనాడు మోడీ వాదించారు. మోడీ వచ్చాక జిఎస్టీని పట్టుబట్టి అమలు చేయడంతో కేంద్రం పక్కా వ్యాపార ధోరణితో ప్రజల నుంచి

ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. వివిధ దేశాలలో ఒకే రకమయిన పన్ను విధానం ఉండడం ప్రపంచీకరణకు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తుందన్న భావనతో, పన్ను సంస్కరణలు మొదలయ్యాయి. కానీ అమెరికా వంటి దేశంలో కూడా జిఎస్టికి చుక్కెదు రయింది. అక్కడ వారికి ఒకే విధానం కంటె, రాష్ట్రాల ప్రతిపత్తే ముఖ్యం అన్న విధాంలో ఉన్నారు. దీర్ఘకాలం జిఎస్టిపై జరిగిన చర్చలలో రాష్ట్రాల హక్కులకు హాని కలుగకుండా సంస్కరణను ఎట్లా సాధ్యం చేయాలన్న అంశంపై వాదోపవాదాలు జరిగాయి. కొత్త విధానంలోకి మారిన వెంటనే కలిగే నష్టానికి పరిహారం చెల్లిస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. జిఎస్టి విధానం అమలు మొదలైన తరువాత, కరోనా ఇబ్బందుల కాలంలోనూ పన్ను వాటా ఆదాయం గణనీయంగా తగ్గిపోయిన సందర్భంలో పరిహారం ఇవ్వడానికి కేంద్రం ఎన్నో మెలికలు పెట్టింది. చివరకు కొంత ఇచ్చింది కానీ, ఇవ్వవలసినంత మాత్రం ఇవ్వలేదు. రాష్ట్రాలను ఇబ్బంది పెట్టడానికి ఆర్థిక కేటాయింపులను వాడడంలో ప్రస్తుత కేందప్రభుత్వం రాజకీయ వ్యూహం చూపుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతిపక్ష రాష్ట్రాల విషయంలో నిధుల కేటాయింపులు, అనుమతుల విషయంలో పక్షపాతం చూపడం, దానికి ప్రతిస్పందనగానే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం, తీవ్రజాతీయత సహాయంతో ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికి, రాష్ట్రాలను పరాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నదని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే పరీక్ష, చివరకు ఒకే ఎన్నికల

దాకా పరిస్థితి వెడుతున్నది. జిఎస్టి పరిహారం సందర్భంలో, తాము కోరుతున్న సంస్కరణలను అమలు చేయడాన్ని ఒక షరతుగా పెట్టడం చూశాం. మొత్తం ఆదాయం కేంద్రం నుంచి మాత్రమే రావలసి వస్తే, ఇక రాష్ట్రాలకు సొంత విధానాలు అంటూ ఏమీ మిగలవు. తాజాగా అలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా అక్కడ పాగా వేయాల న్నది మోడీ నేతృత్వంలోని బిజెపి ప్లాన్‌గా ఉంది. ప్రజల్లో ప్రాంతీయ పార్టీలను చులకన చేసి లేదా మరో రకంగా అధికారం కబ్జా చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్, లెఫ్ట్ నేతలు ఆరోపిస్తున్నారు. జిఎస్టీ సవరణలు కోరినా పట్టించుకోవడం లేదు. అలాగే ఇటీవల చేనేతపైనా భారీగా జిఎస్టీ పెంచాలని చూశారు. అయితే రాష్ట్రాలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. జిఎస్టీ వల్ల కలుగుతున్న ఇబ్బందులను తర్కించి, చర్చించాలని ఆయా పార్టీలు కోరినా లాభం లేకుండా పోతోంది.

# విభజన హామీలు గాలికొదిలిన జగన్

- మోడీ ప్రాపకం కోసం నేతల తాపత్రయం
- ఒత్తిడి పెంచడంలో కానరాని చిత్తశుద్ధి

అమరావతి,ఫిబ్రవరి23(అక్షరం న్యూస్ / ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు పరచడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సానుభూతి ప్రకటిస్తున్నారా లేక..కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారా అన్నది అర్థం కావడం లేదు. అయితే గత పదేళ్లుగా మోడీ మాత్రం ఇంచు మాత్రం సాయం కూడా చేయకుండా కాలం గడపడంలో విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరు గురించి, కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గురించి మోదీ తరచూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆ తప్పును సరిచేసేందుకు గత పదేళ్ళలోనూ దేశ ప్రధానిగా, సభానాయకుడిగా తాను ఎందుకు ప్రయత్నం చేయలేదో మోదీ ఎప్పుడూ చెప్పలేదు. ఈ క్రమంలో ఎపిలో బిజెపిని ఆదరించాలని కోరుకుంటున్నారు. కొన్ని సీట్లను సాధిస్తే రాజకీయాలు తమ గుప్పిట్లో ఉంటాన్న ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్‌డిఎలోకి టిడిపి చేరితే కొంత పరిస్థితి మెరుగు పడగలదన్న ఆలోచనలో స్థానిక నేతలు కూడా ఉన్నారు. టిడిపి, జనసేనలతో కలసి వెళితే ఓ ఐదారు అసెంబ్లీ సీట్లు కొట్టేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ద్వేషించాలంటే, విభజన సమస్యలను పరిష్కరించకుండా సజీవంగా ఉంచడం ముఖ్యమని, తద్వారానే తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చునని బీజేపీ భావిస్తుందన్న భావన కూడా వ్యాప్తిలో ఉంది.

అందుకే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితికి ఊతమిస్తుందనుకొన్న పోలవరం, ప్రత్యేక హోదా అమలు విషయంలో ప్రత్యేక ప్యాకేజి నాటకానికి తెరతీసింది. విభజనపై జరిగిన అన్యాయాలపై సుప్రీంలో పిటిషన్ వేసి కొట్లాడాలని, పార్లమెంటులో చర్చ చేయాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ పదేపదే కోరుతున్నా ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఉండవల్లి మాటలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. కనీసం ఆయనతో చర్చించడానికి కూడా ఎవరు ముందుకు రావడం లేదు. ఎపి ఆర్థికస్థితి దివాళా తీయడానికి జగన్ పాలాన తీరు కూడా కొంత కారణంగా చూడాలి. డబ్బుల పందేరంతో ఖజానాను దెబ్బతీసారు. అనవసర పథకాలతో డబ్బును ఊడ్చేశారు. మరోవైపు సాయం చేయాల్సిన బిజెపి నేతలు ఆర్థిక దివాళా గురించి పదేపదే ఎద్దేవా చేస్తున్నారు. అమరావతి లక్ష్యం వెనక్కి పోయింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు రావణకాష్ఠంలా మండుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో తన రాజకీయ ప్రయోజనాలను బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఇకపోతే అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అలాగే పరస్పర నిందారోపణలతో కాలం గడపటం వల్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఉమ్మడిగా పోరాడాలన్న రాజకీయ స్ఫూర్తి లేకపోవడంతో పదేళ్లు గడిచినా కేంద్రం నుంచి సాధించేది ఏమీ లేదని నిరూపించారు.

విభజన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకాలకు సంబంధించిన సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి సైతం మోదీ సర్కార్ కృషి చేయలేదు. కొన్ని ఆస్తుల పంపకం విషయంలో వాటాలు కుదరక ఇరు రాష్ట్రాలు వివిధ న్యాయస్థానాలను ఆశ్రయించినా కేంద్రం ప్రేక్షకపాత్ర మాత్రమే వహించింది. త్రిసభ్య కమిటీ కూడా ఎలాంటి పురోగతి చూపలేకపోయింది. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటులో ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని కూడా మోదీ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్, నిధుల లోటు భర్తీ, వెనుకబడిన జిల్లాలకు, ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి... ఇలా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ఉన్నత విద్యాసంస్థలను మాత్రం ప్రారంభించి, వాటిలో మౌలిక సదుపాయాల కోసం నిధులను విడతల వారీగా విడుదల చేస్తోంది. మిగతా హామీల అమలుకు పార్లమెంటు సాక్షిగా వాటి అమలుకు మాకు పది సంవత్సరాలు సమయం ఉందని సమాధానం చెప్పి తప్పించుకున్నది. జాతీయ ప్రాజెక్టులకు అందే ప్రయోజనాలు కూడా పోలవరం

ప్రయోజనాలు కూడా పోలవరం విషయంలో అందడం లేదు. విభజన వల్ల, రాజధాని కోల్పోవడం వల్ల నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడానికి ప్రత్యేక హోదా ఇవ్వడమే పరిష్కారమని పార్లమెంటు ఉభయ సభలలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అధికార కాంగ్రెస్ ఐదేళ్లు మాత్రమే హోదా ఇస్తామంటే ప్రతిపక్ష బీజేపీ పదేళ్లు ఇవ్వాలని పట్టుపట్టింది. చివరకు ప్రకటించిన విధంగా ఐదేళ్ల ప్రత్యేక హోదా కూడా ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్‌ను మోదీ ప్రభుత్వం వంచించింది. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడానికి ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర ప్రాయోజిత పథకాలలో అదనంగా వచ్చే 30శాతం నిధులు ప్రత్యేకంగా ఇస్తామని ప్యాకేజీ క్రింద ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటు సభ్యులు– అధికారం, ప్రతిపక్షం రెండుగా చీలిపోయి ప్రత్యేక హోదా రాకపోవడానికి కారణం మీరంటే మీరంటూ నిందించుకొంటూ, అసలు కారణం అయిన మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని మాత్రం ఉమ్మడిగా నిలదీయలేకపోయారు. దీంతో నష్టపోతున్నది మన రాష్ట్రమే అని వారు గుర్తించకపోవడంతో మోడీకి కలసి వస్తోంది. అలాగే పోటీపడి మోడీ ప్రాపకం కోసం ఇప్పుడు నేతలు సాగిలపడుతున్నారు.

# యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృత్యువాత

- మరో ఘోర రోడ్డు ప్రమాదం
- ఓఆర్ఆర్‌పై రెయిలింగ్‌ను ఢీకొన్న కారు
- వరుస ప్రమాదాలను తట్టుకున్నా వెన్నాడినమృత్యువు
- సిఎ రేవంత్, మాజీ సిఎంకెసిఆర్ తదితరుల తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓయువ మహిళానేత ప్రమాదంలో దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలను ఎదుర్కొంటూ వచ్చిన ఆమెను మృత్యువు జయిస్తూ వచ్చారు. చివరకు మృత్యువే జయించింది. కారు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కన్నుమేశారు. ఎన్నో ఆశలతో తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆమెను మృత్యువు నిలనీయలేదు. నీవెంటే నేను అంటూ వెంటాడి చంపింది. చివరకు ఏడాదిలోపే తండ్రి దగ్గరకు లాస్య నందిత చేరుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె పీఏ ఆకాశ్, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎమ్మెల్యే భౌతిక కాయాన్ని పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. నల్గొండలో భారాస బహిరంగసభకు హాజరై తిరిగి వస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలోని చెర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది డిసెంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన లాస్య లిఫ్టులో ఇరుక్కుపోయిన సంగతి తెలిపిందే. ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ కిందకి పడిపోవడంతో అందులో చిక్కుకుపోయారు. ఇలా వరుస ప్రమాదాలు వెన్నాడినా బతికిబయటపడ్డారు. చివరకు జరిగిన ప్రమాదంలో ప్రాణాలు దక్కించుకోలేక పోయారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. గతేడాది ఫిబ్రవరి 19న సాయన్న మృతి చెందారు. ఏడాది కాలంలోనే తండ్రి, కూతురు మృతి చెందడం.. ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. 1987లో హైదరాబాద్‌లో జన్మించిన లాస్య నందిత.. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2016లో సాయన్నతోపాటు భారాసలో చేరారు. 2016-20 మధ్య కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2021 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ నుంచి ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. భాజపా అభ్యర్థిపై 17 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అంతలోనే ఆమె మృత్యు ఒడిని చేరడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనతో బిఆర్ఎస్ సమా అధికార, విపక్ష బిజెపి నేతలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. లాస్యనందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నందిత తండ్రి సాయన్నతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. లాస్య నందిత మృతిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అతి పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొందారని.. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్ వద్ద కారు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే, ఆమెను ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు వెంటాడాయి. 2 ప్రమాదాల్లో ఆమె బయటపడినా.. మూడోసారి ప్రమాదంలో మృత్యువు కబళించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం 2023, డిసెంబర్ 24న బోయిన్పల్లి వద్ద ఆమె లిఫ్ట్ లో చిక్కుకున్నారు. అక్కడ వీఆర్ ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం లిఫ్ట్ లో కిందకు దిగుతుండగా అందులో చిక్కుకున్నారు. చాలామంది లిఫ్ట్ లోకి వెళ్లడంతో కొద్దిసేపటికి డోర్ తెరుచుకోలేదు. దీంతో లాస్య నందితతో పాటు పలువురు దాదాపు 3 గంటలు అందులోనే చిక్కుకుని ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ డోర్ బద్దలుకొట్టి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 13న నల్గొండలో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో లాస్య నందిత పాల్గొన్నారు. సభ అనంతరం తిరిగి హైదరాబాద్ వస్తుండగా నార్కట్పల్లి సమీపంలోని చర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. అదే వేగంతో వెళ్లి ట్రాఫిక్ నియంత్రిస్తున్న హోంగార్డులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో హోంగార్డుకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో లాస్య నందితతో పాటు ఆమె సోదరి, ఇద్దరు గన్ మెన్లు ఉన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న లాస్య నందిత తన సోదరితో కలిసి మరో కారులో హైదరాబాద్ చేరుకున్నారు. నల్గొండ ప్రమాదం జరిగిన 10 రోజుల తర్వాత శుక్రవారం లాస్య నందితను మరో కారు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. గత ప్రమాదం తర్వాత ఆమె కొత్త కారు కొన్నట్లు సమాచారం. గురువారం సదాశివపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన లాస్య నందిత తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున పటాన్ చెరు ఓఆర్ఆర్ సమీపంలో రెయిలింగ్ ను ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఆమె పీఏ, డ్రైవర్ అయిన ఆకాశ్ తీవ్రంగా గాయపడగా.. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిద్రమత్తు, అతి వేగమే కారు ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. 1987లో హైదరాబాద్ లో ఆమె జన్మించారు. కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ పూర్తి చేశారు. గతేడాది, ఫిబ్రవరి 19న లాస్య నందిత తండ్రి సాయన్న మృతి చెందారు. అనంతరం ఈ టికెట్ కోసం స్థానిక నేతలు కొందరు గట్టిగా ప్రయత్నించినా.. మాజీ సీఎం కేసీఆర్ సాయన్న కుమార్తె నందితపైనే నమ్మకం ఉంచారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ తరఫున కంటోన్మెంట్ నుంచి పోటీ చేసి.. బిజెపి అభ్యర్థిపై 17,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తె మృతితో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. కంటోన్మెంట్ ప్రాంతంలో విషాదం నెలకొంది.



## లాస్యనందిత మృతితో బిఆర్ఎస్ షాక్

- ఇంటికి వెళ్లి పార్థివదేహానికి కెసిఆర్ నివాళి
- పలువురు నేతలు ఇంటికి వెళ్లి కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్,ఫిబ్రవరి23(అక్షరం న్యూస్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో బిఆర్ఎస్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఓ యువ ఎమ్మెల్యే మృతితో నేతలంతా షాక్‌కు గురయ్యారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత భౌతిక కాయానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులు అర్పించారు. కార్ఖానాలోని లాస్య నందిత నివాసానికి చేరుకున్న ఆయన ఆమె భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం లాస్య నందిత మాతృమూర్తి, మాజీ ఎమ్మెల్యే సాయన్న సతీమణిని, ఇతర కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. అంతకుముందు లాస్య నందిత మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు. అతిపిన్న వయస్సులో ఎమ్మెల్యేగా నందిత ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కష్టకాలంలో వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లాస్యనందితపార్థివదేహాని బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. కార్ఖానాలో నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కేకే, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్ రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దారం నాగేందర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ విజయా రెడ్డితోపాటు పలువురు నాయకులు ఆమె భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరూ సమీపంలో ఓఆర్ఆర్‌పై అదుపుతప్పి రెయిలింగ్‌కు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. సాయంత్రం మారేడుపల్లిలోని శ్మశానవాటికలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

## ప్రభుత్వ లాంఛనాలతో లాస్య అంత్యక్రియలు

**మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లాస్య నందిత మృతి బాధాకరమని మంత్రి చెప్పారు. ప్రమాద సమయంలో ఆమె సీట్ బెల్ట్ పెట్టుకోలేదని పోలీసులు చెప్పారని వెల్లడించారు. లాస్య నందిత మృతదేహానికి గాంధీ దవాఖానలో పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం కార్ఖానాలోని నివాసానికి ఆమె పార్థివదేహాన్ని తరలించారు. ఈస్ట్ మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లాస్య నివాసానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు.

## లాస్యనందిత మృతి తీరని లోటు

**కుటుంబ సభ్యులకు కెటిఆర్ సంతాపం**

హైదరాబాద్,ఫిబ్రవరి23 అక్షరం న్యూస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లాస్య ఇక లేరనే అత్యంత విషాదకరమైన, షాకింగ్ న్యూస్ తెలుసుకున్నానని చెప్పారు. దాదాపు వారం క్రితమే ఆమెను పరామర్శించానని, అంతలోనే మళ్లీ ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని అన్నారు. చాలా మంచి నాయకురాలిగా ఉన్న యువ శాసనభ్యురాలిని కోల్పోవడం బీఆర్ఎస్ పార్టీకి తీరని నష్టమని చెప్పారు. ఈ విషాద సమయంలో ఆమె కుటుంబం, స్నేహితులకు బలం చేకూర్చాలని ప్రార్థించారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యలుతో ఉన్న ఫోటోలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఎమ్మెల్యే కారు ప్రమాదంపై అనుమానాలు

**లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదం దుర్మరణం పాలైన ఘటన తెలంగాణలో సంచలనం రేపుతోంది. తెల్లవారుజామునే కావడంతో ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న పూర్తి విషయాలైతే తెలియడం లేదు. కారును పూర్తిగా పరిశీలించి పోలీసులు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ కేసులో ట్విస్ట్ ఒకటి వెలుగు చూసింది. ఇప్పటి వరకూ కారు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఇంత ఘోర ప్రమాదం జరిగిందని అంతా భావిస్తున్నారు. కానీ తాజాగా కారును పరిశీలించిన పోలీసులు కేవలం రెయిలింగ్‌ను ఢీకొనడం వల్లే ఇంత ఘోర ప్రమాదం జరగలేదన్న అంచనా కు వచ్చారు. రెయిలింగ్‌తో పాటు ముందున్న లారీని సైతం లాస్య నందిత కారు ఢీ కొట్టినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతివేగంగా వచ్చిన కారు ముందున్న వాహనాన్ని ఢీకొట్టినట్లు ఆనవాళ్లు కనిపించాయి. కారు బ్యానెట్ పైభాగం పూర్తిగా ధ్వంసమైంది. కారుకు ఎడమవైపు ఉన్న ముందు చక్రం సైతం పూర్తిగా ధ్వంసమైంది. మీటర్ బోర్డ్ 100 కిలోమీటర్ల స్పీడ్ వద్ద స్టక్ అయినట్లు పోలీసులు గుర్తించారు. నందిత కారు బ్యానెట్ పై భాగంలో అంటుకొని ఉన్న ఇసుక క్లూస్‌ను పోలీసులు సేకరించారు. ఔటర్ రింగ్ రోడ్డు రెయిలింగ్‌ను ఢీ కొడితే ఈ స్థాయిలో ప్రమాదం జరగకపోవచ్చని నిపుణులు అంటున్నారు.

## సీటు బెల్టుల ధరంచికపోవడం వల్లనే ప్రమాదం

**గతంలో అనేకులు ఇలాగే ప్రమాదానికి గురి**

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

: విం తి విం రి న వేగం.. సీటు బెల్టు ధరించడంలో నిర్లక్ష్యం.. కారు ప్రమాద మరణాలకు ముఖ్య కారణం. పోలీసులు సీటు బెల్ట్ ధరించకుంటే ఫైన్ వేస్తామని హెచ్చరిస్తున్నా పాటించడం లేదు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదంలో మరణించిన వారి జాబితాలో చాలామందే ఉన్నారు. కారు ఉన్న ప్రతి ఒక్కరికి సీటు బెల్ట్‌పై పక్కాగా అవగాహన ఉంటుంది. అయినా సరే.. సమయం అలా వస్తుందో ఏమో కానీ సీటు బెల్ట్ మాత్రం ధరించడం లేదు. ప్రమాదంలో ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి మరణించినప్పుడల్లా సీటు బెల్ట్ ప్రాధాన్యం గురించి చర్చ జరుగుతూనే ఉంటోంది. తాజాగా ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో మరోసారి సీటు బెల్ట్ అంశం చర్చకు వస్తోంది. వాహనం దేన్నయినా ఢీ కొట్టిప్పుడు కారులోని వ్యక్తులు వేగంగా ముందుకు వెళ్తారు. ఆ సమయంలో వాళ్లు డ్యాష్ బోర్డునో.. వెనుక కూర్చున్నవారైతే ముందు సీట్ల మధ్య నుంచి వెళ్లి అద్దాన్ని వేగంగా గుద్దుకునే ఆస్కారముంటుంది. ఇక వాహనం ఏమైనా పల్టీ కొట్టిందా.. ఏకంగా అద్దంలో నుంచి ముందుకు పడిపోవడం జరుగుతుంటుంది. లేదంటే డోర్ ఊడిపోయి ఒక్కసారిగా ఎగిరి బయట పడిపోతారు. అలా జరిగితే తీవ్ర గాయాలై వ్యక్తి మరణించే అవకాశం ఉంటుంది. సీటు బెల్ట్ ధరించినప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టినా లేదంటే కారు పల్టీలు కొట్టినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ముందుగా అద్దంలో నుంచి ముందుకు పడటమో లేదంటే డోర్ ఊడిపోయి ఎగిరి బయట పడటమో జరగదు. ఈ తరుణంలో సీటు బెల్ట్ వారిని రక్షిస్తుంది. సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవుతాయి. దీంతో ప్రమాదం నుంచి సులభంగా గట్టెక్కవచ్చు. అత్యంత అరుదుగా మాత్రమే ఎయిర్ బ్యాగ్స్ సెన్సార్లు యాక్టివేట్ అయి, తెరుచుకోవడానికి 0.05 సెకన్ల సమయం పడుతుంది. ఇలా జరిగితే ఏమీ చెయ్యలేం. కానీ 99.95 శాతం మాత్రం సీటు బెల్ట్ పెట్టుకుంటే పక్కాగా బయటపడతాం. కొన్ని కార్లలో ముందు కూర్చున్న వారికి మాత్రమే సీటు బెల్ట్ ఉంటుంది. సాధారణంగా ఇప్పుడు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే కార్లలో అన్ని సీట్లకూ సీట్ బెల్ట్ ఉంటోంది. వాహనం ప్రమాదానికి గురైన వెంటనే కారులోని సెన్సర్లు యాక్టివేట్ అయిపోయి ఓ యాంగిల్‌ను ఏర్పరుచుకుంటాయి. ఇవి ఎయిర్‌బ్యాగ్ కంట్రోల్ యూనిట్‌కు సమాచారం అందిస్తాయి. వెంటనే బెలూన్ యాక్టివేట్ అయిపోయి తెరుచుకుంటుంది. ఇదంతా కేవలం సెకన్లలోనే జరిగిపోతుంది. ఒకవేళ సీటు బెల్ట్ పెట్టుకోలేదంటే ఈ పక్రియ జరగడానికి ఆస్కారమే ఉండదు. వెరసి ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావు.. ఫలితం మరణమే కావొచ్చు.

# తెలుగులో పట్టుకోసం జాన్వీ యత్నం

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

గత కొన్నేళ్లలో టాలీవుడ్ మార్కెట్ కూడా విపరీతంగా పెరిగింది. దీంతో బాలీవుడ్‌లోని స్టార్ హీరోయిన్లు మాత్రమే కాదు.. యంగ్ హీరోయిన్లు సైతం తెలుగులో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఏదైనా ఆఫర్ వస్తే కాదనుకుండా ఓకే చెప్పేస్తున్నారు. అలాగే జాన్వీ కపూర్ కూడా ఎన్‌టీఆర్ సరసన నటించనున్న 'దేవర'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఈ మూవీ నుండి తన ఫస్ట్ లుక్ కూడా విడుదల చేశారు మేకర్స్. 'దేవర'లో తను హీరోయిన్‌గా నటిస్తుందని అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుండి ప్రతీ ఇంటర్వ్యూలో తనకు ఈ సినిమాకు సంబంధించిన ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఇక తాజాగా పాల్గొన్న ఇంటర్వ్యూలో తెలుగు నేర్చుకోవడంపై జాన్వీ స్పందించింది. దేవర' చిత్రంలో జాన్వీ కపూర్.. తంగమ్ అనే పాత్రలో కనిపించనుంది. పల్లెటూరి పిల్లగా, అచ్చమైన తెలుగమ్మాయిగా జాన్వీ ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను పంచుకుంది ఈ భామ. 'నేనెప్పుడూ తెలుగు నేర్చుకోలేదు. ఆ విషయంలో ఇప్పటికీ సిగ్గుపడుతున్నాను. మామూలుగా వింటుంటే అర్థం చేసుకోగలను. కానీ మాట్లాడలేను. నేను బాధపడే విషయాల్లో అది కూడా ఒకటి. ఇలా నేర్చుకోవాలి అనే ఆలోచన నాలో చాలాకాలంగా లేదు. కానీ దేవర టీమ్ మాత్రం చాలా ఓపికగా నాకు సహాయపడుతున్నారు. వారంతా పెద్ద స్టార్స్‌తో పనిచేస్తున్నా కూడా నా డైలాగుల విషయంలో నాకు సాయం చేయడం కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు' అని 'దేవర' టీమ్ చేస్తున్న సాయం గురించి చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్. ఎన్‌టీఆర్‌తో చేస్తున్న 'దేవర' విడుదల అవ్వకముందే సూర్య, రామ్ చరణ్ లాంటి స్టార్లతో కూడా జాన్వీ నటించనుందని తన తండ్రి బోనీ కపూర్.. ఒక ఇంటర్వ్యూలో ప్రకటించారు. దీంతో ఫ్యాన్స్ అంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కూడా జాన్వీ స్పందించింది. 'మా నాన్న వెళ్లి ఏదో అనౌన్స్‌మెంట్ ఇచ్చేశారు. ఆయన ఏం చెప్పారో కూడా నాకు సరిగ్గా తెలియదు. నాన్న నాతో గానీ, నిర్మాతలతో గానీ ఏమీ మాట్లాడలేదని నేను కచ్చితంగా చెప్పగలను. అప్పుడప్పుడు కేవలం షూటింగ్స్ మాత్రమే చేసుకుంటూ ఏ అనౌన్స్‌మెంట్, క్లారిటీ లాంటివి లేని ప్రపంచంలోకి వెళ్లిపోతే బాగుంటుంది అనిపిస్తుంది' అని బోనీ కపూర్ ఇచ్చిన ప్రకటన గురించి వ్యాఖ్యలు చేసింది. హిందీలో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో దూసుకుపోతున్న సమయంలోనే జాన్వీ కపూర్‌కు టాలీవుడ్ నుండి పిలుపు వచ్చింది. ఎన్‌టీఆర్‌తో చేస్తున్న 'దేవర' విడుదల అయితే తనకు టాలీవుడ్‌లో కూడా గుర్తింపు వస్తుందని ఎదురుచూస్తున్న జాన్వీకి ప్రతీసారి నిరాశే ఎదురవుతోంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ వెళ్తుంది. ఇప్పుడు ఏకంగా ఈ మూవీ రిలీజ్ ఆరు నెలలు పోస్ట్‌పోన్ అయ్యింది. దీంతో ఎన్‌టీఆర్ ఫ్యాన్స్‌తో పాటు జాన్వీ ఫ్యాన్స్ కూడా ఫీల్ అవుతున్నారు. ప్రస్తుతం జాన్వీ చేతిలో మూడు హిందీ చిత్రాలు ఉండగా.. అవన్నీ ఈ ఏడాదిలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. వాటితో పాటు 'దేవర' కూడా ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మా సినిమాకు పిల్లా బచ్చాలు రావద్దు

### ఎ సర్టిఫికెట్‌ను ప్రమోట్ చేస్తున్న తంత్ర

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

ఏ దర్శకనిర్మాత అయినా.. తమ సినిమా అందరూ చూడాలని కోరుకుంటారు. కానీ.. ఈ దర్శకనిర్మాతలు ముందే వార్నింగ్ ఇస్తున్నారు. కారణం.. ఈ సినిమాకు వచ్చిన సెన్సార్ సర్టిఫికేట్ అలాంటిది మరి. తమ సినిమాకి ఎ సర్టిఫికేట్ రావడంపై 'తంత్ర' టీమ్ వెరైటీగా రియాక్ట్ అయ్యింది. మా సినిమాకి పిల్ల బచ్చాలు రావద్దని హెచ్చరిస్తూ 'ఎ ని పెద్దగా హైలైట్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసింది. నిజానికి ఇదొక సరికొత్త క్రియేటివ్ ప్రమోషనల్ స్ట్రాటజీ అని చెప్పుకోవాలి. అలానే తమ సినిమా మంచి హర్రర్ ఎలిమెంట్స్‌తో థ్రిల్ చేస్తుందని కాన్ఫిడెంట్‌గా ఉన్న మేకర్స్.. చిన్నపిల్లలు రావద్దని వారిస్తూ.. వార్నింగ్ ఇస్తున్నారు. ఈ ప్రమోషనల్ స్ట్రాటజీ నిజంగానే మంచి స్పందనను రాబట్టుకుంటోంది. ఈ వార్నింగ్.. అంతా ఈ సినిమా గురించి మాట్లాడుకునేలా చేస్తుంది. ఇప్పటికే రిలీజైన్ చిత్ర టీజర్, సాంగ్స్ మంచి స్పందన రాబట్టుకోగా.. తాజాగా మేకర్స్ వదిలిన వార్నింగ్ పోస్టర్ మరింతగా.. ఈ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. హీరోయిన్ అనన్య నాగళ్ల ప్లలెటూరి అమ్మాయిగా, క్షుద్రపూజలకి గురైన బాధితురాలిగా టీజర్‌లో కనపడితే.. 'ధీరే ధీరే' సాంగ్‌లో అందమైన ప్రియురాలిగా కుర్రాళ్ల మనసుల్ని కొల్లగొడుతోంది. అనన్య నాగళ్లకి జోడీగా శ్రీహరి ఫ్యామిలీ నుంచి వచ్చిన ధనుష్ రఘుముద్రి ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణకానున్నాడు. వీరే కాకుండా 'మర్యాదరామన్న' ఫేం సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్ ఈ హార్డ్‌హిట్టింగ్ హర్రర్ డ్రామాకి తమదైన గాఢతని తీసుకొచ్చారని దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెలుపుతున్నారు. మారుమూల శ్రీకాకుళం జిల్లాలోని ఒక గ్రామం నుంచి వచ్చిన ఈ దర్శకుడు వాల్ట్‌డిస్నీలో పనిచేసే స్థాయికి ఎదిగి, సినిమా తీయాలన్న తన లక్ష్యాన్ని 'తంత్ర'తో సాధించారు. ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్ బ్యానర్స్ సంయుక్తంగా రూపొందించిన ఈ సినిమా ట్రైలర్‌ని త్వరలోనే విడుదల చేస్తామని నిర్మాతలు నరేష్ బాబు, రవి చైతన్య తెలిపారు.

## మంచి పాత్రలు వస్తే మళ్లీ నటిస్తా

### మన్మథుడు హీరోయిన్ అన్షు

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

తాగితే కదా నచ్చుతుందో లేదో తెలిసేది'... ఈ డైలాగ్ వినగానే 'మన్మథుడు' చిత్రం ఎలాగైతే గుర్తొస్తుందో అమాయకంగా ఆ డైలాగ్ చెప్పిన అన్షు కూడా అంతే గుర్తొస్తుంది. మన్మథుడు చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమైన ఈ బ్యూటీ ప్రభాస్‌తో 'రాఘవేంద్ర' చిత్రంలో నటించింది. తమిళంలో రెండు చిత్రాల్లో గెస్ట్ అపీయరెన్స్ లో కనిపించి మెప్పించింది. హీరోయిన్ గా నటించించి రెండు చిత్రాల్లోనే అయినా యువత మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆ తర్వాత ఆమె ఏ సినిమాలోనూ కనిపించలేదు. సచిన్ సగ్గర్ ను పెళ్లి చేసుకుని స్థిరపడింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆమె మీడియా ముందుకొచ్చింది. తాజాగా ఓ తెలుగు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సడెన్ గా సినిమాలు ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో కారణాలను చెప్పింది. 'ఇంగ్లండ్‌లో పుట్టి పెరిగినప్పటికీ.. మా పూర్వీకులు భారతీయులే. 16 ఏళ్ల వయసులో ఇండియా వచ్చాను. అప్పుడే మన్మథుడు సినిమాలో ఆఫర్ వచ్చింది, దీంతో నా కల నిజమైనట్టు అనిపించింది. అయితే సినిమాల్లో యాక్టివ్ కావాలనుకున్నా. కానీ చిన్న వయసు కావడంతో చదువుపై కూడా దృష్టి పెట్టాలనుకున్నా. కానీ మంచి అవకాశాలు రావడంతో సినిమాల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడంటే పీఆర్ టీమ్‌లు వున్నాయి. కానీ అప్పుడు నాన్నే నా వెంట ఉండేవారు. ఎక్కడికి వెళ్లాలన్నా నాన్న పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చేది. కథలు చెప్పడానికి ఎవరైనా వచ్చినా వాళ్లు ముందుగా నాన్ననే కలవాల్సి వచ్చేది. నేను తెలుగులో నటించిన రెండు సినిమాల్లోనూ సెకెండ్ హీరోయిన్ గానే చేశా. రెంటింటిలోనూ నా పాత్ర చనిపోతుంది. ఈ సినిమాలు చూసి మరో రెండు మూడు చిత్రాల్లో అలాంటి రోల్స్‌నే ఆఫర్ చేశారు. ఆ తరహా పాత్రలు చేయడం కన్నా ఖాళీగా ఉంటే బెటర్ అనిపించి సినిమాల్ని వదిలేశా' అని అన్నారు. ప్రస్తుతం తనకు నచ్చే క్యారెక్టర్ ఆఫర్ చేస్తే మళ్లీ సినిమాల్లో నటిస్తా అని ఆమె తెలిపారు.

## మళ్లీ వేగం పుంజుకున్న గేమ్ ఛేంజర్ షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా కోలీవుడ్ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా జరుపుకుంటుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి రామ్‌చరణ్, నవీన్‌చంద్రపై ఓ యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరిస్తునట్లు సమాచారం. ఇక ఈ షెడ్యూల్ మార్చి 2 వరకు జరగనుంది. సాధారణ యువకుడు అసాధారణ నాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరిస్తూ చక్కటి సామాజిక సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. అరవింద్ స్వామి, ఎస్‌జే సూర్య, సురేష్ గోపి, ఈషా గుప్తా, అంజలి, శ్రీకాంత్, జయరామ్, సునీల్, హ్యారీ జోష్ మరియు నవీన్ చంద్ర ఈ సినిమాలో కీలక పాత్రలలో కనిపించనున్నారు.

## కథా,కథనంలో బలం లేని
# సుందరం మాస్టారు చిత్రం

హైదరాబాద్,ఫిబ్రవరి23అక్షరం న్యూస్

ఏ సినిమా కయినా కథలో బలం ఉండాలి. కథనంలో పట్టు ఉండాలి. అప్పుడు చిన్న సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. ప్రముఖ నటుడు రవితేజ నిర్మాణ సంస్థను ప్రారంభించి కొత్తవాళ్ళకి ప్రోత్సాహం ఇస్తూ, చిన్న సినిమాలను తీస్తున్నారు. ఇప్పుడు 'సుందరం మాస్టర్' అనే సినిమాతో కళ్యాణ్ సంతోష్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేశారు. హాస్య నటుడిగా పలు చిత్రాలలో నటించిన హర్ష చెముడు ఈ సినిమాతో కథానాయకుడిగా పరిచయం అయ్యారు. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు, దివ్య శ్రీపాద కథానాయకురాలు. సుందరం (హర్షవర్ధన్) ఒక ప్రభుత్వ కళాశాలలో సోషల్ టీచర్ గా పనిచేస్తూ ఉంటాడు. అతనికి కట్నం మీద ఆశ ఎక్కువ, అందుకని ఎవరు ఎక్కువ కట్నం ఇస్తారా అని పెళ్లి ప్రయత్నాల్లో ఉంటాడు. ఆ ప్రాంత ఎమ్మెల్యే (హర్షవర్ధన్)కి మిరియాలమెట్ట గ్రామం నుండి తమ వూరికి ఒక ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిని పంపించమని లేఖ వస్తుంది. మిరియాల మెట్ట అనే గ్రామ ప్రజలు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా వుంటారు, ఆ గ్రామంలోకి బయట వాళ్ళకి కూడా ప్రవేశం లేదు. కానీ ఆ గ్రామంలో ఒక విలువైన వస్తువు ఎదో ఉందని, ఆ వస్తువుని కనిపెట్టి ఆ గ్రామాన్ని తన నియోజకవర్గంలో కలిపేయాలని ఎమ్మెల్యే సుందరాన్ని కోరతాడు. దానితో తనకి పేరొస్తుందని, సుందరాన్ని డిఈఓ గా ప్రమోషన్ కూడా ఇస్తానని ఎమ్మెల్యే మాట ఇస్తాడు. ప్రొమోషన్ వస్తే కట్నంగా ఇంకా ఎక్కువ డబ్బు రాబట్టవచ్చు అని సుందరం కూడా ఆ గ్రామానికి వెళ్ళడానికి ఒప్పుకుంటాడు. సుందరం ఇంగ్లీష్ టీచర్ గా మిరియాల మెట్ట గ్రామంలో అడుగుపెడతాడు. కానీ అతనికి ఆశ్చర్యంగొలిపే విషయం ఏంటంటే, అక్కడ ఆ గ్రామస్థులు అందరూ సుందరం మాస్టర్ కన్నా చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతూ వుంటారు. సుందరంకి ఇంగ్లీష్ సరిగ్గా రాదనీ అతనికే ఒక పరీక్ష పెడతారు. ఆ పరీక్షలో ఫెయిలైతే ఉరితీత అని చెప్తారు. మరి ఆ పరీక్షలో సుందరం సఫలం అయ్యాడా, విఫలం అయ్యాడా, ఇంతకీ ఆ వూర్లో వున్నా విలువైన వస్తువు ఏంటి? అది సుందరం కనిపెట్టాడా? అతనికి ప్రమోషన్ వచ్చిందా? ఇంతకీ అతని పెళ్లి సంగతి ఏమైంది? ఇవన్నీ తెలియాలంటే 'సుందరం మాస్టర్' సినిమా చూడాల్సిందే. హర్ష చెముడు కథానాయకుడిగా సినిమా అనగానే వినోదాత్మకంగా ఉంటుందని అనుకొనన్న వారికి తీవ్ర నిరాశ తప్పదు. వినోదాత్మకంగా కానీ, ఇటు ఏదైనా కథాబలం వున్న సినిమాగా కానీ తెరకెక్కించలేదు. అసలు ఈ సినిమా ద్వారా దర్శకుడు ఏమి చెప్పాలనుకున్నాడో కూడా అది చెప్పలేకపోయాడు. కథ సరిగా లేకుండా కేవలం రెండు గంటలకి పైగా ఎదో అక్కడక్కడా కొన్ని హాస్య సన్నివేశాలు పెట్టి సినిమా నడిపిద్దాం అన్న రీతిలో సినిమా సాగింది.

నటీనటుల విషయానికి వస్తే హర్ష చెముడు తన పాత్రకి తగిన న్యాయం చేసాడు. అక్కడక్కడా హాస్యం పండించాడు. దివ్య శ్రీపాద కథానాయకురాలిగా బాగుంది, కానీ ఆమెకి పెద్దగా ప్రాధాన్యం లేని పాత్ర ఇచ్చారు. హర్షవర్ధన్ ఎమ్మెల్యేగా, అతని పీఏ గా భద్రం పరవాలేదనిపించారు. ఇక మిగతా నటీనటులందరూ తమ పాత్రల పరిధి మేరకు చేశారు. ఛాయాగ్రహణం పరవాలేదు, సంగీతం బాగుంది. మాటలు ఆలోచనాపరంగా వున్నాయి, కొంచెం వేదాంత ధోరణిలో కూడా వున్నాయి. రవితేజ లాంటి సీనియర్ నటుడు ఈ సినిమా ఎలా నమ్మి నిర్మాతగా ఒప్పుకున్నారో ఆయనకే తెలియాలి.

## ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్

- ఇట్టి ప్రారంభోత్సవం ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా జరిగింది.
- వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేణికింది.అశోక్ మరియు భవన నిర్మాణ కమిటీ చైర్మన్ కట్కూరి శ్రీనివాస్ వారి ఆధ్వర్యంలో దిగ్విజయం.

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి – 23 (అక్షరం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో పట్టణ శుక్రవారం రోజున ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాధవి రాజు, స్థానిక కౌన్సిలర్ వంగళ దివ్య శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు రేణికింది అశోక్, పట్టణ ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాస్, సంఘం కోశాధికారి కట్కం సత్యనారాయణ,కట్కూరి శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్, దైత కుమార్, బుస్సా శ్రీనివాస్, నాగుబోతు రవీందర్, తదితరులు ఆర్య వైశ్య సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## పదవీ విరమణ పొందనున్న కార్పొరేట్ జిఎం పిఎస్కే రవిని సన్మానించిన జిఎం చింతల శ్రీనివాస్

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:** సింగరేణి సంస్థ కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం లో జనరల్ మేనేజర్ (సర్వే) గా విశిష్ట సేవలందించి ఈ నెల చివరిలో పదవి విరమణ పొందనున్న పి.యస్.కె రవి ని ఆర్ జి 1 జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆర్.జి 1 ఏరియా జీ.ఎం చింతల శ్రీనివాస్ అధ్యక్షతన వివిధ విబాగల అధికారులు వారిని పూలమాలలు బొకెలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వారు చేపట్టిన పలు కార్యక్రమాలు,అభివృద్ధి పనులను కొనియాడారు.పదవి విరమణ తరువాత వారి శేష జీవితం సుఖ సంతోశాలతో,ఆయురారోగ్యాలతో,అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.జి 1 ఏరియా జీ.ఎం చింతల శ్రీనివాస్,ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్,ఎజంట్స్ చిలుక శ్రీనివాస్,సైదులు,ఎజియం పర్సనల్ లక్ష్మినారాయణ అధికారులు,ఆంజనేయ ప్రసాద్,ఏరియా సర్వే అధికారి ప్రభాకర్, రాజం, శ్రీనివాస్,ధనలక్ష్మి బాయి అఫ్రిన్ సాంబశివరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ లపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జర్నలిస్ట్ శంకర్ పై దాడి చేసిన వారిని శిక్షించాలి జర్నలిస్ట్: అఫ్జల్ పఠాన్

**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** ప్రభుత్వ పాలనపరమైన లోపాలను ఎత్తిచూపడాన్ని తట్టుకోలేక తమకు వ్యతిరేక వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కొందరు నాయకులు దాడులకు ప్రోత్సహించడం సిగ్గుచేటని కొత్తగూడెం కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ అఫ్జల్ పఠాన్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకొచ్చిన నాటి నుంచి రేవంత్ సర్కారు వైఫల్యాలపై వరుస కథనాలను తెలంగాణం పత్రిక ,న్యూస్ లైన్ తెలుగు ఛానెల్ ద్వారా ప్రశ్నిస్తున్న జర్నలిస్ట్ శంకర్ పై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గతంలో కూడ ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫోన్ ద్వారా బెదిరించి మరి నేడు దాడికి పాల్పడి శంకర్ ను తీవ్రంగా గాయపర్చడం అమానుష చర్య అన్నారు. ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న జర్నలిస్ట్ లపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వపరమైన లోపాలను బయటపెడితే వాటిని సరిచేసుకోవడం ప్రజాప్రతినిధుల భాద్యత కానీ నేడు కొందరు మా నాయకుడిపై విమర్శ చేస్తావా? వ్యతిరేక వార్తలు రాస్తావా అంటూ పాత్రికేయులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. జర్నలిస్ట్ శంకర్ పై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఆర్ ఎఫ్ సి ఎల్ బాధితులకు న్యాయం చేయాలి.

## అఖిలపక్షం నాయకులు శ్వేత పత్రం విడుదల చేయాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె విశ్వనాథ్

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొత్తగా ఏర్పడ్డ ఆర్ ఎఫ్ సి ఎల్లో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉద్యోగాలు వస్తాయి అని కలలు కంటే నిరుద్యోగులను ఉద్యోగాలు పెట్టిస్తామని లక్షలాది రూపాయలు లంచాలు తీసుకొని రోడ్డున పడేశారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే విశ్వనాథ్ ఆరోపించారు. సంవత్సరాలు గడుస్తున్న నేటి వరకు కూడా ఆ దళారుల పైన చర్యలు తీసుకోలేదు బాధితులకు న్యాయం చేయడం లేదు కొత్తగా ఏర్పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే దృష్టి సాదించాలని ఆర్ ఎఫ్ సి ఎల్ బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.అఖిలపక్షం పేరుతో కొంతమంది వామపక్ష పార్టీలు,విప్లవ పార్టీలుగా చెప్పుకునే నాయకులు నేటికీ ఎంత మందికి డబ్బులు పంచారో ఎంతమందికి న్యాయం చేశారు బయటకు ప్రకటించే పరిస్థితి లేదని లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న నిరుద్యోగ యువతకు మాత్రం న్యాయం జరగలేదన్నారు. ఆర్ఎఫ్ సి ఎల్ లో పనిచేస్తున్న యువతకు సరిగా జీతాలు రావడం లేదు పనివేళలు కూడా మార్చే పరిస్థితి లేదు శ్రమ దోపిడి చేస్తున్న యాజమాన్యం పైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విప్లవ పార్టీల ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని కలిసొచ్చే ప్రగతి శీల శక్తులను కలుపుకొని ఆర్ ఎఫ్ సి ఎల్ బాధితులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామన్నారు.

# మల్లాపూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**మద్నూర్ / ఫిబ్రవరి 23 ( అక్షరం న్యూస్ – కామారెడ్డి ):** డో%శీ%గ్లీ మండలం మల్లాపూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం కావడం జరిగింది. శుక్రవారం రోజున మల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి మండలం మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. చైర్మన్ సంగమేశ్వర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సౌకర్యాలు, సదుపాయాలు కలగాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంత రావు దృష్టికి తీసుకోవెల్లి తక్షణమే 5 లక్షల నిధులు మంజూరు చేయడం తో గ్రామంలో నూతన సిసి రోడ్డు ద్వారా ప్రజలకు సదుపాయాలు కలుగడం జరుగుతుంది. మల్లాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యే కాంత రావు గ్రామ అభివృద్ధికి సహకారం అందించడంతో ప్రత్యక ధన్యవాదములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పర్చడం తో పార్టీ శ్రేణుల తో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేయడం జరుగుతుంది. త్వరలోనే పేద కుటుంబాలకు అత్యవసారమగు గ్యాస్ సిలండర్ 500 రూపాయలకు, అలాగే రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు నెలకు 200 వందల యూనిట్లు ఉచితపథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే రైతులకు ఒక శుభ వార్త రావడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల యొక్క 2 లక్షల రూపాయల రుణ మాఫీ పై సమీక్షా నిర్వహించి రైతులకు లాభర్జనలు చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు కూడా ఒకే దఫా రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందని తెలిపారు.సిసి రోడ్డు పనులు కార్యక్రమం లో మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్ పటేల్, రామ గొండ, శ్రీకాంత్, లక్ష్మణ్, రాజు పటేల్, సంగ్రాం పటేల్, సాయి, మేరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కాల్పులు జరపడం అమానుషం...

- ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు బట్టు నాగేశ్వరరావు...

**మహబూబాబాద్/కేసముద్రం/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:** రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కావాలని కోరడమే నేరమన్నట్లు హర్యానా ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి,చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రక్తసిక్తం చేయడంపై నిరసిస్తూ కేసముద్రం మండల కేంద్రంలో గురువారం నాడు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు బట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ... రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులను దేశానికి శత్రువుల చూస్తూ,వారిని అడ్డుకోవడానికి అడుగడుగున సిమెంట్ బార్కెట్లు ఇనుప ముళ్ల కంచెలు బిజెపి ప్రభుత్వం పెట్టిందని తెలిపారు.అయినా వెనక్కి తగ్గకుండా చావో రేవో తేల్చుకుంటామని కనీసం మద్దతు ధర చట్టం తెచ్చే వరకు పోరాటం సాగిస్తామంటూ రైతులు బారికెట్లను కంచెలను తోసుకొని ముందుకు వెళ్లే ప్రయత్నం చేయగా హర్యానా పోలీసులు రబ్బర్ బుల్లెట్లు,టియర్ గ్యాస్ ఫిరంగులతో తీవ్రస్థాయిలో రైతులపై విరుచుపడ్డారని పేర్కొన్నారు.ఈ ఘటనలో పంజాబ్ రాష్ట్రం బటిండా జిల్లా బాలాక్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువరైతు శుభకరణ్ సింగ్ చనిపోయారని,25 మంది రైతులకు గాయాలయ్యాయని తెలిపారు.హర్యానా ప్రభుత్వ దాష్టికానికి ఇంతకుముందు ఇద్దరు రైతులు బలయ్యారన్నారు.రైతుల పట్ల మోడీ ప్రభుత్వ దుర్మార్గానికి ఇదొక నిదర్శనమని తెలిపారు.రెండు సంవత్సరాల క్రితమే రైతుల డిమాండ్లను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చి అమలు పరచకుండా తిరిగి చర్చల పేరుతో మభ్యపెడుతురన్నారు.ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమిస్తున్న రైతులను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అలాగే మారణకాండను ఆపివేయాలని,రైతులపై కాల్పులు జరిపిన పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బండి రాజు,జిలకర బాబు,నూకల లింగస్వామి, పబ్బతి సాగర్,బట్టు మధు తదితరులు పాల్గొన్నారు.

# గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లకు సహకరించిన వారిని అభినందించిన రామగుండం ఎమ్మెల్యే

- జాతర ఏర్పాట్లకు సహకరించిన వారి సేవలు చాలా అమూల్యమైనవి: ఎమ్మెల్యే మక్కాన్సింగ్

**గోదావరిఖని ప్రతినిధి/(అంతర్గాం మండలం)పెద్దపల్లి/ ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:**

పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం గోలివాడ గోదావరి ఒడ్డున నెలకొన్న సమ్మక సారలమ్మ జాతర కార్యక్రమాలలో భాగంగా జాతర ఏర్పాట్లకు సహకరించిన ప్రతి శాఖ వారికి కమిటీ వారు,పత్రికేయులు,రెవెన్యూ శాఖ వారు, పోలీసు శాఖ వారు,విద్యుత్ శాఖ వారు,ఆరోగ్యశాఖ వారు,ఎన్ టి పి సి వారు,సింగరేణి వారు, గ్రామ పంచాయతీ కమిటీ వారు,మత్స్య శాఖ వారు, పలువురు ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యేమక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ పిలుపుమేరకు ఎమ్మెల్యే నిరంతర పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లకు సహకరించిన ప్రతి శాఖ వారికి పేరుపేరునా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీరు అందించిన సేవలు వెలకట్టలేని వని చాలా అమూల్యమైనవని ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ జాతరఏర్పాట్లలో కీలక పాత్ర పోషించిన అధికారులకు,ఆయా విభాగాల సిబ్బందిని సన్మాన%శీ%తో గౌరవించి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కమిటీ సభ్యులు,మండల కమిటీ నాయకులు ముఖ్య నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్లకు వీధుల నియామక పత్రాలు అందజేత

- ప్రజా ఆరోగ్యం మెరుగుపడుటకు ఆరోగ్య సేవలతో కృషి చేయాలి
- డి.సి.హెచ్.స్.డాక్టర్ కే.ఎన్.రమేష్ చంద్ర

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 23(అక్షరం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.317 మరియు జోనల్ విధానంలో ఇటీవల ప్రభుత్వ నిర్వహించిన (స్టాఫ్ నర్సులు) నర్సింగ్ ఆఫీసర్లను నియామకంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాకు 66మందిని కేటాయించగా నేడు 64 మంది విధుల్లో చేరినట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కే.ఏన్.రమేష్ చంద్రా తెలిపారు.ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని అచ్చంపేట ఏరియా ఆసుపత్రికి 26 మందిని, కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రికి 26 మందిని, అమ్రాబాద్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి 14 మందిని కేటాయించినట్లు తెలిపారు.ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖను ప్రథమంగా బలోపేతం చేయాలని దృక్పథంతో పనిచేస్తుందని, జిల్లాలోని ప్రజా ఆరోగ్యం మెరుగుపడుటకు ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు.

గతంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేసిన స్టాఫ్ నర్సులు నేడు రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకం చేసిందని ఇకపై గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సేవలు అందించుటకు కృషి చేయాలని కోరారు.ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి ప్రజా ఆరోగ్యం మెరుగు పడుటకు నర్సింగ్ సేవలు ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరిర్డెంట్ పద్మ,సీనియర్ అసిస్టెంట్లు కామేశ్వరి,అరుణాదేవి,శ్రీదేవి నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## గరిపేట సమ్మక్క సారక్క జాతరలో పాల్గొన్న ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్

- ఎండి.రజాక్

**భద్రాద్రి జిల్లా /చుంచుపల్లి /ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** రామవరం గరిపేట నందు గల సమ్మక్క సారక్క జాతరకు ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఐఎన్టియుసి నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతరలో మూడు రోజుల నుండి ప్రజలు భారీ స్థాయిలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొంటూన్నారని, ప్రతి ఒక్కరికి మంచి జరగాలని, వారు కోరుకున్న కోరికలన్నీ విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, గుడి నిర్వాహకులు కామిశెట్టి కొండలరావు, శాంతాదేవి, సాయి రాజ్, మల్లారపు కొమురయ్య, కొండల్, సన్నీ, పాష, టింకు, భక్తులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి...

- తల్లాడ ఎస్సై కొండలరావు

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** తల్లాడ మండలంలో ఉన్న ఆటో, టాటాఏసీ వ్యాన్ డ్రైవర్లు తప్పనిసరిగా నియమాలను పాటించాలని తల్లాడ ఎస్సై బి కొండలరావు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆటో, వ్యాను ఏ వాహనమైన పూర్తిగా డాక్యూమెంట్స్ తో కండిషన్ లో ఉండాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, తదితర పత్రాలన్నీ కలిగి ఉండాలన్నారు. ఆటోడ్రైవర్లు కూలీలతో భారీగా ప్రజలను తరలిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డ్రైవర్ పక్కన అటు ఇటు ఎవరు కూర్చోకూడదన్నారు. ఆటోల్లో , వ్యాన్ లలో సామర్థ్యానికి మించి కూలీ ప్రయాణికులను ఎక్కించరాదని, ఎక్కిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆటోల్లో పెద్ద పెద్ద సౌండ్ పెట్టి వాహనాలు నడపొద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేనిపక్షంలో డ్రైవర్లపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 30 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

- దేశం మొత్తానికి ఒకే రూల్ వర్తింప చేయాలని ఒక్క రోజు గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సమ్మె

**భద్రాద్రి జిల్లా /కొత్తగూడెం/ ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, దేశం మొత్తానికి ఒకే నేషనల్ రూరల్ బ్యాంకు అఫ్ ఇండియా గా ఒక్కతాటి మీదికి తేవాలని, బ్యాంకు ఉద్యోగుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఏపీజీవీబీ రీజినల్ ఆఫీస్ ముందు సమ్మె చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా కొత్తగూడెం లో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ రీజినల్ సెక్రటరీ గోవర్ధన్, అసిస్టెంట్ రీజనల్ సెక్రటరీ జలంధర్, ఎంప్లాయిస్ రీజినల్ సెక్రెటరీ విద్యాసాగర్ అసిస్టెంట్ సెక్రటరీ మాలోత్ కృష్ణ పాల్గొని మాట్లాడారు. దేశం మొత్తానికి ఒకే నేషనల్ రూరల్ బ్యాంకు అఫ్ ఇండియా(ఎన్ ఆర్ బీఐ) గా ఒక్కతాటికి తేవాలని, ప్రమోషన్ రూల్స్ ని వెంటనే రివైజ్ చేయడం, ఖాళీగా ఉన్న 30 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, సర్వీస్ రూల్స్ ని మార్చడం, డైలీ వేజ్ వర్కర్స్ ని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపిన మద్దెల సుధీర్ కుమార్

**భద్రాద్రి జిల్లా /కొత్తగూడెం/ ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** రాజ్యసభ ఎంపిగా బీఆర్ఎస్ పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు కొత్తగూడెం బీఆర్ఎస్ యువజన నాయకులు మద్దెల సుధీర్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో ఎంపిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి.. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మద్దెల సుధీర్ కుమార్ మాట్లాడుతు వద్దిరాజు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్ర తన పదవీ కాలంలో ప్రజా సమస్యలపై తన వాణిని బలంగా వినిపించారని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం విశేష కృషి చేసారన్నారు. వద్దిరాజు నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేసి ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని గెలిచి కెసిఆర్ కు బహుమతిగా ఇస్తామన్నారు.

## జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వానా భాష షేక్

**జనగామ/ రఘునాథపల్లి /( అక్షరం న్యూస్ ) ఫిబ్రవరి 23:** జనగామ జిల్లా నూతన కలెక్టర్ గా వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి రిజ్వానా భాష షేక్ రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఐదుగురు ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రిజ్వానా భాషా జనగామకు బదిలీ కాగా, ఇప్పటివరకు జనగామ కలెక్టర్ గా పనిచేస్తున్న శివ లింగయ్యను అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బదిలీ అయ్యారు.

# క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యే మా ప్రత్యేకత...

- విద్యార్థుల వీడ్కోలు సభలో ఠాగూర్ కరస్పాండెంట్ రవికుమార్

**ఖమ్మం/ వైరా ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే తమ విద్యాసంస్థల ప్రత్యేకత అని ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ అన్నారు. శుక్రవారం వైరా లో ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన చేయడమే మా క్రాంతి జూనియర్ కళాశాల ప్రత్యేకత అన్నారు.గత విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను, వివిధ సామాజికసేవ, సాంస్కృతిక, కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ట్రేష్మా ఉపాధ్యక్షులు ఉమాశంకర్, ప్రముఖ మోటివేటర్ తాటిపల్లి సుధీర్, ప్రిన్సిపల్ కృష్ణారావు, పీవో లింగారావు, అధ్యాపకులు మజీద్,వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఖిలాపై కాషాయపు జెండా ఎగురవేయటం ఖాయం...

- బిజెపి రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద రావు

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఖమ్మం కిలపై కాషాయపు జెండా ఎగురువేయటం ఖాయమని రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద రావు తెలిపారు. ఈనెల 25న ప్రారంభమవుతున్న విజయ సంకల్ప యాత్ర సన్నాక సమావేశం శుక్రవారం తల్లాడ లో మండల అధ్యక్షులు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ యాత్ర ఇంచార్జ్ తిరుపతి రెడ్డి తో తాండ్ర వినోద రావు కలిసి వాల్పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ పాలనను మరొక్కసారి దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.స్వాతంత్రానంతరం కాంగ్రెస్ వారు ఈ దేశంలో చేయలేనటువంటి మహత్తర అద్భుతమైన దేశహిత కార్యక్రమాలు పేద ప్రజలే లక్ష్యంగా పేదరికం నుంచి విముక్తి కల్పించాలని పేద ప్రజలను ఉద్దేశించి ఎన్నో పథకాలను పెట్టి నేరుగా పేద ప్రజలకు అందేటట్లు చేసినటువంటి ఘనత భారత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కిందని అన్నారు ప్రపంచ యవనికపై భారతావని ముందు వరసలో నిలిపిన ఘనత మన ప్రధాని దే అని తెలిపారు. గత ఐదు శతాబ్దాలుగా మరుగున పడి ఉన్నటువంటి రామజన్మభూమి వివాదాన్ని పరిష్కరించి రామ్ లాల విగ్రహాన్ని ప్రతిష్టించి 141 కోట్ల మంది భారత ప్రజల అభిమానాన్ని పొందిన ఘనత శ్రీ నరేంద్ర మోడీ దే అని తెలిపారు. ప్రజలందరకు సమన్యాయం కావాలని అహర్నిశలు పరితపిస్తూ అవినీతి లేకుండా పరిపాలన సాగిస్తున్నటువంటి ఘనుడు మన నరేంద్ర మోడీ అని అన్నారు నరేంద్ర మోడీ కలలుగన్న నవభారతం నిర్మాణం కోసం మనమంతా ప్రధాని మోదీకి మద్దతు మరొక్కసారి ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైనదని తెలిపారు అందుకోసం రాబోయే సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి మనమంతా నరేంద్ర మోడీ వెంట ఉండి నరేంద్ర మోడీకి మద్దతు తెలిపి మరొకసారి ప్రధానిగా ఎన్నుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో

ఈనెల 26వ తారీకున విజయసంకల్పయాత్ర పేరుతో యాత్ర కార్యక్రమం తల్లాడ లో జరుగుతుందని ఆ కార్యక్రమానికి ప్రజలంతా వచ్చి నరేంద్ర మోడీని ఆశీర్వదించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, జిల్లా నాయకులు డాక్టర్ జి వెంకటేశ్వర్రావు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీ వీరంరాజు, జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా కిసాన్, మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు, మండల ప్రధాన కార్యదర్శి గాద కృష్ణారావు, మండల నాయకులు రాయల రమేష్, చౌడా నాగేశ్వరరావు, వాడవల్లి నాగేశ్వరరావు, గొల్లమందల నరేష్, చిట్టెం నరసింహారావు, తోట రాంబాబు, ఎల్లంకి సుధాకర్, ఎస్ కే అలీషా, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి జీవిత లక్ష్యం చదువే..

- గట్టు ఎంపీపీ విజయ్ కుమార్

**గద్వాల్ జిల్లా/అయిజ మండలం/ఫిబ్రవరి23/అక్షరం న్యూస్:** మండల పరిధిలో గట్టు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వార్షికోత్సవం మరియు 10వ తరగతి విద్యార్థుల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ వీడుకోలు సమావేశంను ఉద్దేశించి ఎంపీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితం అవుతుంది అన్నారు. పాఠశాలయే విద్యార్థులకు మొదటి సమాజం అన్నారు. ఈ యొక్క కేజీబీవీ నుంచి విడిపోతున్న 10 తరగతి. ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు మంచిగా చదివి ఈ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. విద్య యొక్క ఆవశ్యకతను మరియు సామాజిక రుగ్మతలై న బాల్య వివాహాలు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించం గురించి ఇంటి నుంచే పారిశుద్ధ్యర్ని అలవాటు చేసుకోవాలని మద్యాన్ని సేవించడం వల్ల జరిగే అనర్థాలను ఇంటికి వెళ్ళినప్పుడు మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో ప్రతిభా కనబరిచిన ఉత్తమ ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను సన్మానించడం జరిగింది సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ గుంటి గోపీలత రాయపురం ఎంపీటీసీ రంగస్వామి అంగడి బసవరాజు మేస్త్రీ తిమ్మప్ప మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ రమేశ్ రజుసాగర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కుంగ్ ఫు,కరాటే విద్యార్థులకు, పథకాలను బహుకరించిన ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...!

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి - 23 (అక్షరం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ గగ్గురి దివ్య ఆధ్వర్యంలో ఈనెల 18 వ తేదీన హైద్రాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి యుసేఫ్ గూడ స్టేడియం నందు నిర్వహించిన 4 వ నేషనల్ ఓపెన్ కరాటే,కుంగఫు ఛాంపియన్ షిప్ 2024 రుద్రమదేవి షాటకన్ డో సెల్ఫ్ డెఫిన్స్ అకాడమీ వారు నిర్వహించిన టొర్నమెంట్ లో మా కరాటే విద్యార్థులు 18 మంది పాల్గొనగ 15 మంది బహుమతులు గెలుచుకున్నారు .

వీరిలో బ్లాక్ బెల్ట్ విభాగంలో విగ్నేష్, అర్ణవ్ ప్రథమ స్థానం గోల్డ్ మెడల్, ప్రసన్న, ద్వితీయా స్థానం సిల్వర్ మెడల్ ని, అలాగే పిట్టల లత, తృతీయ స్థానం బ్రాండియా మెడల్ ని కలర్ బెల్ట్స్ విభాగంలో మహితేజ్, సిధాంత్, శరత్ చంద్ర, మన్విత, సంజన, విశ్వతేజ, హిరణ్, సాయి చరణ్, గ్రేష్మిక, సాయి తేజ, శ్రీనిత్య , చైతన్య, జెసిక, రక్ష నిత్యానందిని, అశ్విత, రిష్మిక, ఆగస్య, సాయి, రిత్విక్, రోషన్ హంసిని, రోషిని, అశ్రీత, మనశ్విని, సహస్ర లు ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు వీరిని కౌన్సిలర్ భీంగి మహేష్,మాస్టర్ శ్రీనివాస్, ప్రసాద్, సురేష్, విష్ణు, శ్రావణి, లాస్య లత మాస్టర్స్ లు అభినందించారు.

# రామగుండం నగర పాలక సంస్థ బడ్జెట్ అంకెలు మారుతున్నాయి తప్ప ఈ ప్రాంతం అభివృద్ధి జరగడం లేదు

- అవినీతే అభివృద్ధిగా భావిస్తున్న కొంతమంది ముఖ్య ప్రజాప్రతినిధులు,అధికారులు
- రాష్ట్ర ప్రభుత్వం ఏటా నగర పాలక సంస్థ కు 100 కోట్లు కేటాయించాలి
- మద్దెల దినేష్

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:** రామగుండం నగర పాలక సంస్థ ప్రతి ఏటా బడ్జెట్ బారి ఉహాలతో అంకెల గారడితో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు కానీ అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందుతుందన్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ విమర్శించారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ ఉహాజనీతం గా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం మెజార్టీ సభ్యులతో ఆమోదింపచేసుకోవడం అలవాటుగా మారిందన్నారు. కనిసం బడ్జెట్ పై చర్చ జరుపకపోవడం ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదన్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ నగరాల్లో రామగుండంకు ఒక ప్రత్యేక పేరు ఉందని,మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన అభివృద్ధి లో పూర్తిగా వెనకపడిపోయి అవినీతి లో అగ్రభాగాన నిలుస్తుందన్నారు.ఏటా రెండు మూడు వందల కోట్ల రూపాయల బడ్జెట్ తయారు చేయడం, ప్రజానీకాన్ని నమ్మించడం, ప్రభుత్వాల నుండి నిధులు రావని తెలిసిన అంకెల గారడితో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 211 కోట్ల 22 లక్షల 27వేల అంచనాలతో బడ్జెట్ రూపొందించా రని వాటిని అన్ని రకాలుగా అభివృద్ధి పనులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం నగరంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతాయని,నిరంతరం అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని ఒక వైపు వారి నగర పాలక సంస్థలో అధికార పార్టీ కార్పొరేటర్లే పనులు జరగడంలేదని ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నామని ముఖ్య ప్రజా ప్రతినిధులకే మోర పెట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని అన్నారు. రామగుండం నగర

పాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బడ్జెట్ 2024-25 ప్రత్యేక సమావేశము నిర్వహించి చురుగ్గా పనులు చేపడుతామని ప్రతి బడ్జెట్ సమావేశంలో పాడిందే పాటగా పాడుతున్నారు తప్ప ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని మరి అభివృద్ధి ఎక్కడజరుగుతుందని ప్రశ్నించారు.ఇక రాష్ట్ర బడ్జెట్ లో కూడా ప్రతి ఏటా రామగుండం కార్పొరేషన్కు వంద కోట్లు రూపాయలు నిధులు తీసుకురావాలని ఎమ్మెల్యే గారికి సూచించారు. రాబోయే 20 ఏళ్లలో పరిస్థితులు అంచనా వేసి నగరాన్ని అభివృద్ధి దిశలో నడిపించడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నరని చెప్తున్నప్పటికి, కొంతమంది అధికారులు ముఖ్య ప్రజాప్రతినిదులు అవగాహన రాహిత్యం వల్ల మీకు అవినీతి మీద ఉన్న శ్రద్ధ, అభివృద్ధి మీద లేక 20 ఏళ్ళు అభివృద్ధి నిలిచి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.యాభై డివిజన్లలో అభివృద్ధి చేస్తున్నాం అని చెప్తున్నారు కానీ ఏమీ చేశారో ప్రజలకి శ్వేత పత్రం విడుదల చేసి చూపించాలని హితువు పలికారు. గోదావరిఖనిలోని డివిజన్లలో ఎలాంటి ప్రగతి లేకున్నా 24గంటలు నగరాన్ని అద్భుతంగా హంగు ఆర్భాటలతో కొందరు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.అన్ని డివిజన్లలో రోడ్లు,డ్రైనేజి, చెత్త చెదరంతో దుర్వాసనతో కంపు కోడుతున్న పట్టించు కునే వారు కరవైనారని,నీటి సమస్య కొరతతో కలుషిత నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,కార్పొరేషన్ లో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉందన్నారు. ఒక్కో డివిజన్ కు నిధులు ఎంత కెటయిస్తున్నారు శ్వేతా పత్రం విడుదల చేయాలన్నారు ఎస్సి సబ్ ప్లాన్ పనులు వాటి నిధులు ఎమయ్యాయని ప్రశ్నించారు.నగరంలో పారిశుధ్య నిర్వహణ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.నూతన వాహనాలను కొనుగోలు చేసి ములకు పడేసారు గ్రీన్ బడ్జెట్ తో పాటు మురికి వాడల అభివృద్ధి కోసం కూడా బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్తున్నారు, హరితహారం పేరుతో మొక్కలు లేవు వాటి లెక్కలు లేవు.సానిటరీ విభాగంలో జరిగిన భారీ కుంభకోణాల లో త్వరలో బైటికి వస్తాయని,కొందరి అండదండలతో ఒకనోక సానిటరీ ఇన్స్పెక్టర్ కోట్లు రూపాయలు దారి మళ్లిస్తున్నారని దీని పై విజిలెన్స్ విచారణకుఆదేశాలు జారి చేయాలని,విచారణ జరిపిస్తే ప్రజాధనం మొత్తం బైటికి వస్తుందన్నారు.నగర పాలక సంస్థలో కొంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు కమిషన్లు మీద బినామీ కాంట్రక్టు పనుల మీద కాకుండా ప్రజా సంక్షేమం, అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 594 మందిపై కేసులు నమోదు..

- విస్తృతంగా పోలీస్ పెట్రోలింగ్ ....
- నిర్జన ప్రాంతాలలో తనిఖీలు..
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 594 మందిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ కమీషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించిషాపులు తెరవడం, పని లేకున్నా రోడ్లపై రావడం, బర్త్ డేల పేరుతో నడి రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించేవారిపై సిటీ పోలీస్ యాక్ట్ ను ఖచ్చితంగా అమలు చేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు. అలాంటి వ్యక్తులకు జరిమానా, జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన,చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పెర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేస్తూ.. రాత్రివేళలో నిర్జన ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ వీధుల్లో సంచరించడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం, వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం,ఘర్షణలకు దిగడం, ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా వుంటుందని తెలిపారు.

# రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని సన్మానించిన కొత్వాల

**భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిను, వ్యవసాయ, చేనేత, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతనంగా రాజ్యసభ సభ్యురాలుగా ఎన్నికైన రేణుకా చౌదరిను ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రుల నివాసంలో వారిని కలిసి, కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, ఉమ్మడి జిల్లా రైతుల అభ్యున్నతిపై చర్చించారు. అనంతరం నూతనంగా రాజ్యసభ సభ్యురాలు గా ఎన్నికైన జి.రేణుకా చౌదరిని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హైదరాబాద్ లో కలుసుకొని, శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను బోకే, శాలువాలతో సత్కరించారు. ఎంపీ గా ఎంపిక కావడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, పాల్వంచ మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, గంగిదేవిపాడు సొసైటీ వైస్ చైర్మన్ తూము వీరభద్రరావు, కాంగ్రెస్ నాయకులూ దారా చిరంజీవి, పెటేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సమ్మక్క సారలక్క వనదేవతలను దర్శించుకుని ముడుపులు చెల్లించిన జిఎం చింతల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

- దంపతులు చింతల లక్ష్మి శ్రీనివాస్

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్:** గోదావరి నది పరివాహక ప్రాంతంలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో శుక్రవారం అమ్మవార్లను ఆర్జి-1 ఏరియా జియం చింతల శ్రీనివాసు సేవా అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మి శ్రీనివాసు కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క సారలక్క అమ్మవార్లను దర్శించుకొని అమ్మవార్లకు ముడుపులు చెల్లించారు. ఈ సందర్భంగా జియం మాట్లడుతూ సింగరేణి సంస్థ ఆర్జీ-1 ఏరియా సహకారంతో భక్తుల సౌకర్యార్థం శ్రీసమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో భక్తులకు త్రాగునీటి సౌకర్యం, అమ్మ వార్ల దర్శనానికి వెళ్ళు భక్తులకు ప్రత్యేక బ్యారికేడ్స్,విద్యుత్తు సౌకర్యం,స్నాన గట్టాలు పరిసర ఆలయ ప్రాంగణమంతయు లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయించడం జరిగిందన్నారు. అమ్మవారి సేవలో ఆర్ జి 1 ఏరియా లోని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆర్ జి 1 ఏరియా కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం ని జనగామ కార్పోరేటర్ జనగామ కవిత,సమ్మక్క సారక్క ఆలయ కమిటీ సభ్యులు జీఎం ని శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో యస్.అండ్.పిసి సెక్యురిటి జూనియర్ ఇన్స్ పెక్టర్స్ చందా శ్రీనివాస్,ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవో చంద్రమౌలీని సన్మానించిన దగ్గుల శ్రీనివాసరెడ్డి...

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళిని తల్లాడ మండల నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి శుక్రవారం సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, పంచాయతీ ఈవో మహేష్, ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి, పొట్టేటీ జనార్దన్ రెడ్డి, ధూపాటి భద్రరాజు, కోటేరు వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## డిఎం.హెచ్.ఓ శిరీష పై కుల సంఘాలు చేస్తున్నవన్ని అసత్య ఆరోపణలే..

- డిఎం.హెచ్.ఓ శిరీష కు అండగా నిలిచిన తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్

**భద్రాద్రి జిల్లా /కొత్తగూడెం/ ఫిబ్రవరి.23/ అక్షరం న్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎం.హెచ్.ఓ డా.జేవీఎల్ ల్.శిరీష పై కొన్ని రోజులుగా కుల సంఘాలు చేస్తున్నవన్ని అసత్య ఆరోపణలేనని తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆమెకు అండగా నిలిచారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జేవీఎల్ శిరీష పై గిరిజన సంఘాలు చేస్తున్న ఆరోపణలపై తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు, ఆరు నెలల నుండి కొన్ని గిరిజన సంఘాలు వైద్య ఆరోగ్య శాఖపై మరియు డిఎం అండ్ హెచ్ ఓ దగ్గర ఒక వ్యక్తి తాను చెప్పిన డిమాండ్లు నెరవేర్చలేదని వాస్తవాలను తన వెనుక ఉన్న గిరిజన సంఘం నాయకులకు చెప్పకుండా, ఇతర సంఘ నాయకులను తప్పుదోవ పట్టిస్తూ అబద్ధాలను నిజం చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తూ డిఎంహెచ్ఓ శిరీష ను మానసికంగా వేధిస్తూ, వారి విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. 5,6 నెలల నుండి సోషల్ మీడియా వేదికగా మరియు పత్రికలలో నిరాధారణ ఆరోపణలు చేస్తూ డిఎం అండ్ హెచ్ఓ ను మానసిక శోభకు గురిచేస్తూ వేధించడమే పనిగా పెట్టుకుని దుష్ప్రచారం చేస్తుంటే కేసు పెట్టకపోతే రాచ మర్యాదలు చేస్తారా అంటూ ఘాటుగా స్పందించారు. వైద్య ఆరోగ్య శాఖ లో నియామకాలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఉంటుందని, ఆ కమిటీ కులం కుశంగా పరిశీలన చేసి తర్వాత మాత్రమే నియామకాలు ఇస్తారని,అది కూడా తెలియకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అసత్య ఆరోపణలు చేసినంత మాత్రాన నిజాలు అబద్ధం కావని, అబద్ధం నిజం కాదని డిఎం అండ్ హెచ్ ఓ వద్ద చేసిన డిమాండ్లు కప్పిపుచ్చుకొని , ఐదు ఆరు నెలల నుండి ఒక జిల్లా అధికారిని వేధించడమే సంఘం ఉద్దేశము, పనిగా పెట్టుకున్నారని, ఇలాంటి అసత్య ఆరోపణలను మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. కావున గిరిజన సంఘాల నాయకులు ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకొని అసత్య ఆరోపణలు మానుకోవాలని మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ కోరింది.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

- ఎమ్మెల్యే మృతికి ఎంపీ నామ సంతాపం..

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ యువ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మృతి మృతి పట్ల బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో కంటోన్మెంట్ సీనియర్ ఎమ్మెల్యే అయిన తన తండ్రి సాయన్న మృతి నుండి ఇంకా కోలుకోక ముందే లాస్య మృత్యువాత పడటం ఎంతో బాధ కలిగిస్తుందన్నారు. ప్రజా సేవలో సాయన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందిన లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమన్నారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యే గా గెలిచి రాజకీయంగా ఎదుగు తున్న లాస్యను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడం దురదృష్ట కరమన్నారు. వారి కుటుంబా నికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్ ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని నామ ప్రార్థించి, భరోసా ఇచ్చారు.

## జక్కంపూడి కృష్ణమూర్తిని పరామర్శించిన మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, నాయకులు..

**ఖమ్మం/ తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తిని అన్నారుగూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమతతో పాటు నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాజకీయాల్లో ఎంతో సుదీర్ఘ అనుభవం ఉన్న జక్కంపూడి కృష్ణమూర్తి మరలా నిండు ఆరోగ్యంతో ప్రజా జీవితంలోకి రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లంకి వెంకటేశ్వరరావు, మారెళ్ళ మల్లికార్జున్ రావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, పొన్నం కృష్ణయ్య, దుగ్గినేని గోపయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు మారేళ్ల వెంకటయ్య, పూనాటి సత్యమయ్య, నున్న సందీపులు, తాళ్ల వెంకటేశ్వర్లు, వ్యాపారి పసుమర్తి పుల్లయ్య, బేగ్ నాగుల్ మీరా, మల్లిడి శేషయ్య ఉన్నారు.

## రుద్రవరం మత్స్యశాఖ అధ్యక్షునిగా తునికి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నిక...!

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి - 23 (అక్షరం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో శనివారం మత్స్య శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తునికి శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షులు తునికి అజయ్ క్యాషియర్ తునికి మహేందర్ సభ్యులు గంగ మల్లేశం తునికి దేవయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు తునికి శ్రీకాంత్ మాట్లాడుతూ సంఘం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని, తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కరాటే క్రీడాలకు ప్రభుత్వపరంగా సహాయసహకారాలు అందిస్తాం...!

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
-రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల వేములవాడ, ఫిబ్రవరి 23 అక్షరం న్యూస్):** కరాటే క్రీడలకు ప్రభుత్వ పరంగా సహాయసహకారాలు అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్ లో . వచ్చే నెల మార్చి3 తేదీన ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కె వసంత్ కుమార్ లతో కలిసి ఆవిష్కరించారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వపరంగా కరాటే క్రీడకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వేములవాడలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. .పోటీల చీఫ్ ఆర్గనైజర్ అబ్దుల్ మన్నాన్ మాట్లాడుతూ ఈ పోటీలకు సుమారు 600, 800 మంది క్రీడాకారులు మరియు 60 మంది ఆఫీసియల్స్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సీనియర్ కరాటే మాస్టర్లు కూరగాయల శ్రీనివాస్, దండు గల తిరుపతి, లో లోపు రాజు , మానుపాటి తిరుపతి, కాస రాజశేఖర్ రెడ్డి, కనికరపు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట రాఘవపురం రహదారి మంజూరు చేయాలి

-బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / సుజాతనగర్/ ఫిబ్రవరి 23/ అక్షరం న్యూస్ :** సీతంపేట ఆంజనేయస్వామి దేవాలయం నుండి రాఘవపురం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.శుక్రవారం సీతంపేట గ్రామంలో పర్యటించి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ సీతంపేట గ్రామం నుండి రాఘవపురం గ్రామానికి రోజు వందలాది మంది రైతులు,ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారని సరైన రహదారి లేకపోవడం వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సీతంపేట, రాఘవపురం గ్రామాలు ఏర్పడి ఆరవై ఏళ్ళు దాటినా నేటికీ రహదారి లేకపోవడం పాలకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రతీ నాయకుడు ఎన్నికలప్పుడు హామీ ఇవ్వడం గెలిచాక మర్చిపోవడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని సీతంపేట రాఘవపురం రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సాయి, జిల్లా కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ ఇంచార్జ్ నాగుల రవికుమార్, తడికమల్ల దిలీప్, తాళ్లూరి మోహన్ దాస్, తగరం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## టీసిఆర్‌పిఎ 2024 డైరీని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్

- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ముందుగా పూల బొకేను అందించిన టి సి ఆర్ పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి – 23 (అక్షరం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ క్యాంపు ఆఫీసులో గురువారం రోజున టీ సి ఆర్ పి ఎ 2024 సంవత్సరము డైరీని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, చేతుల మీదుగా ఆవిష్కరించి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ కి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వం దృష్టికి తప్పనిసరిగా తనవంతుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు ..ఈ కార్యక్రమంలో టి సి ఆర్ పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బాలసాని ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి గుడిసె సంతోషి, కోశాధికారి ఎలగందుల నగేష్ కార్యవర్గ సభ్యులు చైతన్య, రాజు ,రఘు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు చైర్మన్ అభినందనలు

**జనగామ/ రఘునాథపల్లి /( అక్షరం న్యూస్ ) ఫిబ్రవరి 23:** రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ గా నియమి తులైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని కలిసి అభినందనలు తెలిపినట్లు టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జన గామకు చెందిన మహ్మద్ జమాల్ ష రీఫ్ ఒక ప్రకటనలో తెలి పారు, శుక్రవారం హైదరాబాదు లో ఆయనను కలిసి సత్కరిం చినట్లు పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు, ఉర్దూ భాష పరిరక్షణకు సేవలందించాలని కోరినట్లు తెలిపారు

## నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన...

**ఖమ్మం/తల్లాడ ఫిబ్రవరి 23 (అక్షరంన్యూస్):** పాలేరు :కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో జరిగే పలు వివాహాది శుభకార్యక్రమాలు, దైవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# ఎమర్జెన్సీ వార్డులో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి....
- జిల్లా కలెక్టర్ ప్రియాంక అల...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / కొత్తగూడెం/ ఫిబ్రవరి23/ అక్షరం న్యూస్** : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్ర ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో కలియ తిరుగుతూ వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో తొలుత ఎమర్జెన్సీ వార్డును సందర్శించారు. అక్కడి రోగులతో మాట్లాడారు వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా మందులు ఇస్తున్నారా ఎన్ని రోజులు నుండి ఆసుపత్రిలో ఉన్నారు ఇలాంటి తదితరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ రోగులకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు పేదవారు వస్తారని, మెరుగైన సేవలు అందించాలని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు వినియోగించుకొనేలా చూడాలని, ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం ఆర్థోపెడిక్ వార్డ్, ఇంటెన్సివ్ కేర్ ను సందర్శించి అక్కడ రోగుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు.సిబ్బంది యొక్క హాజరు బయోమెట్రిక్ రికార్డులను పరిశీలించిన ఆమె అలసత్వం వహించిన వైద్యులు, సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు, సిబ్బంది హాజరు బయోమెట్రిక్ విధానంలో నూరు శాతం ఉండాలని ఆసుపత్రి సూపర్డెంట్ ను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు ఎంతవరకు జరిగినవి ఇంకా ఎంతవరకు జరగాల్సినవి సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు తో ఆసుపత్రి వెలుపల డ్రైనేజీ నిర్మాణం కు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. వారం రోజుల్లో ఆస్పత్రిలో ఉన్న పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఆస్పత్రి ఏ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ శిరీష, ఆసుపత్రి ఇంచార్జి సూపర్డెంట్ లక్ష్మణరావు, ఆర్ఎంఓ జిజిహెచ్ డాక్టర్ పుష్పలత, ఆర్ ఎం ఓ ఎం సి హెచ్ రామవరం డాక్టర్ వీరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్ ఆస్పత్రి అన్ని విభాగాల మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం...!

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మత్స్యకారులకు కేజ్ కల్చర్ చేపల పెంపకంపై అవగాహన సదస్సు
- అనుపురంలో కుట్టు శిక్షణ,మిల్లెట్ ఫుడ్ తయారీ ప్రారంభం

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, ఫిబ్రవరి – 23 (అక్షరం న్యూస్):** ముంపు గ్రామాల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల మత్స్యకారులకు కేజ్ కల్చర్ లో భాగంగా రాహు, బొచ్చె, బంగారు తీగ తదితర చేప పిల్లల పెంపకంపై అవగాహన సదస్సును వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులకు కేజ్ కల్చర్ చేపల పెంపకంపై వీడియో ద్వారా వివరించారు. ఈ యూనిట్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఉందని తెలిపారు. తక్కువ స్థలంలో తక్కువ పెట్టుబడి తో అధిక లాభాన్ని పొందడమే దీని లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం మత్స్యకారులకు కేజ్ కల్చర్ పై అవగాహన కల్పించి, దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ముంపు గ్రామాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి కేజ్ కల్చర్ చేపల పెంపకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో చేపల పెంపకంతో లాభాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలో పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్య మానేరు ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 1600 మత్స్యకారుల కుటుంబాలు రిజిస్టర్ అయి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మొత్తం 1100 కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉందని విప్ వెల్లడించారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ– రాఘవరెడ్డి మాట్లాడారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు.

**ముంపు గ్రామాల మత్స్యకారులకు సువర్ణ అవకాశం...**

చేపల పెంపకం ముంపు గ్రామాల మత్స్యకారులకు సువర్ణ అవకాశమని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. యూనిట్ మొత్తం విలువ రూ. 3 లక్షలని, దానిలో పురుషులకు 40 శాతం, మహిళలకు 60 శాతం సబ్సిడీ ఉందని వెల్లడించారు. గ్రామంలోనే నోడల్ బ్యాంక్ ఆధ్వర్యంలో రేపటి నుంచి శిబిరం ఏర్పాటు చేస్తామని, అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. చేపల పెంపకం పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా టూర్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అనుపురంలోని శాలివాహన సంఘ భవనంలో మొదటి విడుత అనుపురం, రుద్రవరం, కోడుముంజ, చింతల్ ఠాణ గ్రామాల్లో డి ఆర్ డి ఏ సౌజన్యంతో (ఎస్ హెచ్ జి) మహిళలకు టైలరింగ్ లోని వివిధ మోడల్ లలో అధునాతన ఫ్యాషన్ డిజైనింగ్, మిల్లెట్స్ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ పై శిక్షణ తరగతులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విప్ ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి హాజరై ప్రారంభించారు. అనంతరం విప్ మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్, మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల తయారీ పై 15 రోజులు శిక్షణ ఇస్తారని, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల దాకా తర్ఫీదు ఉంటుందని వివరించారు. మహిళలకు ఉదయం టిఫిన్, భోజనం, స్నాక్స్ ఉన్నాయని తెలిపారు. శిక్షణ కాలంలో రోజు రూ. 50 ఇస్తారన్నారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. స్కూల్ యూనిఫామ్ లు కూడా వీరి ద్వారా కుట్టించే విధంగా చర్యలు చేపడతామని విప్ తెలిపారు. పేపర్ బ్యాగులు కుట్టిస్తే వేములవాడ ఆలయం, అలాగే పట్టణంలోని దుకాణాల్లో తీసుకునేలా ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు.

**కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం...**

అనుపురం లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ప్రారంభించారు, మహిళలు శిక్షణ కాలంలో నేర్పించే అంశాలపై దృష్టి సారించాలని కోరారు. మీరందరూ చాలా మందికి ఆదర్శ ప్రాయంగా నిలువాల న్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీఓ శేషాద్రి, నాబార్డ్ ఏజీఎం మోహన్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖా అధికారి శివప్రసాద్, ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి తదితరులు ఉన్నారు.

# సమ్మక్క, సారలమ్మల పోరాటం స్ఫూర్తిదాయకం

- గ్రామాల్లో జాతర సందడి నెలకొంటోంది...
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /కొత్తగూడెం/ఫిబ్రవరి 23/అక్షరం న్యూస్ :** నాటి రాచరిక పాలనపై వీర వనితలు సమ్మక్క, సారలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలోని రామాటాకీస్ ఏరియా, గౌతంపూర్, 2 ఇంక్లైన్, గరీబపేట, లక్ష్మీ దేవిపల్లి, పులిగుండం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర ప్రదేశాలను శుక్రవారం సందర్శించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరల్లో మతసామరస్యం వెల్లివిరుస్తోందని, కులమతాలకతీతంగా ఉత్సవాల్లో పాల్గొని దేవతామూర్తుల గద్దెలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. వ్యయప్రయాసలకోర్చి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ అన్నివర్గాల ప్రాణాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్న ఉత్సవ కమిటీలను ఆయన అభినందించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, వి.మల్లికార్జున్ రావు, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, ఎస్ కె.ఫహీమ్, నూనావత్ గోవిందు, గుగులోత్ నగేష్, తోట రాజు, అంకూస్, ఖూయ్యూమ్, బిక్షపతి, ఉపేందర్, యు. హరీష్, సపావట్ రవి, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609